## వెబ్‌సైట్‌లో నవోదయ ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్‌లు

- 10న ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి : ప్రిన్సిపాల్

నవతెలంగాణ-నిజాంసాగర్

జవహర్‌లాల్ నవోదయ విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి 9వ, 11వ తరగతులలో ఖాళీగా ఉన్న ప్రవేశ సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యవతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లను మీసేవ లేదా ఆన్‌లైన్ సెంటర్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్‌లో ఏదైనా ఇబ్బందులు ఉంటే జవహర్‌లాల్ నవోదయ విద్యాలయానికి వచ్చి తీసుకోవాలని సూచించారు.

## 'మహాలక్ష్మి' పథకం దరఖాస్తులలో తప్పిదాల సవరణకు సర్వే బృందాలు : కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా మహాలక్ష్మి పథకం కింద ప్రజలు సమర్పించిన దరఖాస్తుల్లో తప్పిదాలు ఉంటే, వాటిని సవరించేందుకు వీలుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక సర్వే బృందాలను నియమించినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం తెలిపారు. ఈ బృందాలు ఈ నెల 07వ తేదీ (బుధవారం) నుండే సర్వే చేపడతాయని వివరించారు. మహాలక్ష్మి పథకం కింద వంట గ్యాస్ సిలిండర్ రూ. 500/- లకే అందించాలని ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో ప్రజల నుండి ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించిందని, అయితే ఈ దరఖాస్తులలో పలువురు గ్యాస్ ఏజెన్సీ పేరు, కన్జ్యూమర్ నెంబర్, రేషన్ కార్డు నెంబర్ వంటి వివరాలను దరఖాస్తులలో సరిగ్గా పొందుపరచలేదని వివరించారు. అలాంటి దరఖాస్తుదారుల వివరాలను సరి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్ ను రూపొందించిందని తెలిపారు.



భిక్కనూర్‌లోని ఓ ప్రయివేటు స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

## పరిమితికి మించి విద్యార్థులను తరలించొద్దు

- ప్రయివేటు స్కూళ్లకు విద్యాశాఖాధికారుల హెచ్చరిక
- నవతెలంగాణ కథనం నేపథ్యంలో స్కూళ్లల్లో తనిఖీలు

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలకు తిరిగి ఇంటికి పంపేందుకు ఏర్పాటు చేసుకున్న ప్రయివేటు వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలించొద్దని విద్యాశాఖాధికారులు పలు ప్రయివేటు స్కూల్ యజమానులను హెచ్చరించారు. ఈ నెల 2న నవతెలంగాణలో ప్రచురితమైన కథనం నేపథ్యంలో భిక్కనూర్‌లోని పలు ప్రయివేటు పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి ఎల్లయ్య మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల నుండి సమాచారం సేకరించి రిపోర్ట్ తయారు చేశారు. రాత్రిపూట తరగతుల నిర్వహిస్తున్నారని, ఫీజుల వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకుని అలాంటి తరగతులు గనుక నిర్వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని పాఠశాల యజమానులను హెచ్చరించారు. ఇకనుండి అయినా ప్రైవేట్ పాఠశాల యజమానులు ఏ వాహనంలో ఎంత మందిని తరలించాలో అంత మందిని తరలిస్తే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని పలువురు విద్యార్థి తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

## రేషన్‌దారుల సమస్య పరిష్కరించండి

పౌరసరఫరాల శాఖకు కలెక్టర్ ఆదేశం.. నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి లో రేషన్ దుకాణం లేక ఆ గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై 'రేషన్ కోసం పక్కూరికి' అనే శీర్షికతో నవతెలంగాణలో ప్రచురితమైన విషయం విధితమే. ఈ విషయం సోషల్ మీడియాలో కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి వెంటనే పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి వెంటనే ఆ గ్రామంలోని సమస్యను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.

స్పందన

# కడుపునింపుతూ పస్తులు

- మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.3 కోట్ల బిల్లుల బకాయిలు
- ఇంకా అందని అల్పాహారం బిల్లులు
- అప్పులు చేసి భోజనం పెడుతున్నామని కార్మికుల ఆవేదన
- కొత్త ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించేనా..?

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నా.. బిల్లులు మాత్రం పెండింగ్‌లోనే ఉంటున్నాయని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోతున్నారు. అప్పు చేసి మధ్యాహ్న భోజనాన్ని వండి వడ్డిస్తున్నా.. తమ గోడును ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఏజెన్సీ నుంచి తప్పుకుందామనుకుంటే.. ఇప్పటి వరకు చేపట్టిన బిల్లులు ఎక్కడ ఆగిపోతాయో అనే భయంతో కొనసాగిస్తున్నా.. ఏటికేడు బిల్లులు పెండింగ్‌లోనే ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వమైనా కనికరించి పెండింగ్‌లో ఉన్న బకాయిలు బిల్లులు విడుదల చేయాలని కోరుతున్నారు. దీంతో పాటు ఇటీవల అల్పాహారం వడ్డించిన బిల్లులు సైతం బకాయిలు ఉన్నట్లు పేర్కొన్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 981 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇప్పటివరకు మధ్యాహ్న కార్మికులకు రావలసిన బిల్లులు మూడు కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. అల్పాహారానికి సంబంధించిన పది లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. నవంబర్ వరకు మధ్యాహ్న భోజన కార్మికులకు కేవలం కోడిగుడ్డ బిల్లులను అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఏజెన్సీ నడపాలంటే బయట వడ్డీలకు తెచ్చి ఏజెన్సీని నడుపుతున్నట్లు వాపోతున్నారు.

**అల్పాహారానికి అందని బిల్లులు**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పాఠశాలలో ఉదయం అల్పాహారం ఇచ్చేందుకు ప్రతి జిల్లాలో ఒక స్కూల్లో ఎంచుకుని అధికారులు అక్టోబర్ 1 నుండి ప్రారంభించారు. విద్యార్థికి 10.50 రూపాయలు చొప్పున కేటాయించారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 42 పాఠశాలలలో అల్పాహారం కార్యక్రమాన్ని కొనసాగించగా.. డిసెంబర్ రాకముందే కార్యక్రమాన్ని ముగించేశారు. ఆ బిల్లులు సుమారు 20 లక్షల వరకు ఇప్పటివరకు రాలేదు.

**ధరలు పెరుగుతున్నా.. చార్జీలు పెంచట్లే**

ఒకటవ తరగతి నుంచి 5 తరగతి విద్యార్థులకు భోజనం పెట్టినందుకు ఒక్కో విద్యార్థికి 5.45 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఆరవ తరగతి నుండి ఎనిమిదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి 8 రూపాయల 17 పైసలు, 9 నుండి 10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి 10 రూపాయల 65 పైసలు ప్రభుత్వం చెల్లిస్తుంది. భోజనం ఏజెన్సీలకు ప్రభుత్వం ద్వారా అందించేది కేవలం బియ్యం మాత్రమే. ఉప్పు, పప్పు, కారంపొడి, నూనె తదితర సామగ్రిని పూర్తిగా మధ్యాహ్న భోజన నిర్వాహకులే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో వారికి వచ్చే ఐదు, పది రూపాయల నుండి నాలుగు నుండి ఎనిమిది రూపాయల వరకు వాటికే చెల్లించాల్సి వస్తుందని కార్మికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క కోడిగుడ్డు బయట మార్కెట్లో ఏడు నుంచి 8 రూపాయలు ఉంటే ప్రభుత్వం మాత్రం ఐదు రూపాయలే ఇస్తుందని తెలిపారు. కోడిగుడ్ల కాలంగా చూసుకుంటే ఏ ఒక్క రోజు కూడా ఒక కోడిగుడ్డు ధర 5 రూపాయల లోపల లేదన్నారు. నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా.. మెస్ చార్జీలు మాత్రం పెంచడం లేదని, పైగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు వేధింపులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. మెస్ చార్జీలు పెంచి సకాలంలో తమకు బిల్లులు చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు.



**పస్తులుండొద్దనే..**



వెంకటేశం, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి వడ్డించేందుకు బయట నుంచి అప్పులు తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. మేము భోజనం పెట్టడం మానేస్తే విద్యార్థులు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. మాకు ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఏదైనా మధ్యాహ్న భోజనాన్ని మాత్రం కొనసాగిస్తున్నాం. ఈ కొత్త ప్రభుత్వమైనా తమ కష్టాల్ని అర్థం చేసుకొని తమకు మధ్యాహ్న భోజన బిల్లులు నెల వచ్చేలా చూడాలి. గత నాలుగు నెలల బిల్లుల సైతం తొందరగా ఇప్పించి మమ్మల్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

**కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలి**



మధ్యాహ్న భోజన నిర్వాహకుడు దుర్గయ్య, సదాశివ నగర్

కోడిగుడ్డ అదనపు ధర మాపై భారం పడుతుంది. అంగన్‌వాడీలకు ఇచ్చిన మాదిరిగానే మాకు కూడా ప్రభుత్వమే కోడిగుడ్లను పంపిణీ చేయాలి. ఇప్పటికే బిల్లులు రాక అప్పుల్లో ఉన్నాం. దానికి తోడు ఈ గుడ్ల పెనుభారం భరించాలంటే మా వల్ల కాదు. ప్రభుత్వం ఆలోచన చేసి ప్రభుత్వమే కోడిగుడ్లను సరఫరా చేయాలి. నిత్యవసర ధరలకు అనుకూలంగా మెస్ చార్జీలను పెంచి మమ్మల్ని కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఆదుకోవాలి.

**త్వరలో అల్పాహారం బిల్లులు**

జిల్లా విద్యాశాఖ అధికారి రాజు



మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉన్నతాధికారులకు నివేదించాము. అల్పాహారం బిల్లులు త్వరలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అందజేస్తాము. మధ్యాహ్న భోజన బిల్లులు కూడా త్వరలోనే అందుతాయి.

# సాగు సాగేదెలా..?

- 25వ డిస్ట్రిబ్యూటరీ కాలువకు గండ్లతో వృధాగా పోతున్న సాగునీరు
- చెరువులు నిండక ఎండుతున్న ఆయకట్టు
- అయినా పట్టని అధికారులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్



సాగునీరు అందక ఎండిపోతున్న వరి పంట



25వ డిస్ట్రిబ్యూటరీ కాలువ నుంచి వృధాగా పోతున్న నీరు

నిజాంసాగర్ ప్రధాన కాలువ ఆయకట్టు ప్రాంతంలో వరిసాగుకు నీటి అవసరాలు పెరగడంతో.. చివరి భూములకు సాగునీరు అందక అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. అయితే చెరువులకు, ఆయకట్టుకు నీరందించే కాలువలకు పలుచోట్ల గండ్లు పడి సాగునీరు వృధా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. సాగునీటి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎంతో విలువైన సాగునీరు రోడ్డుపాలవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చివర ఆయకట్టుకు నీరు అందే అవకాశం లేకపోవడంతో సాగు సాగేదెలా అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

నిజాంసాగర్ ప్రధాన కాలువ నుంచి వచ్చే నీరే రైతులకు ఆధారం. 25వ డిస్ట్రిబ్యూటర్ కాలువ ద్వారా మైలారం, మీర్జాపూర్, బీర్కూర్‌లోని ప్రధాన చెరువులు నిండుతాయి. దీని పరిధిలో సుమారు ఐదారువందల ఎకరాల ఆయకట్టు ఉంది. కాలువ ద్వారా చెరువులకు నీరు వచ్చి.. అక్కడి నుంచి పంట పొలాలకు సాగునీరు అందుతుంది. అయితే 25వ డిస్ట్రిబ్యూటర్ కాలువ గండ్లు కొట్టడంతో సాగునీరు వృధాగా పోతుంది. మీర్జాపూర్ చెరువులోకి రావాల్సిన సాగునీరు రాకపోవడంతో దాని కింద ఉన్న ఆయకట్టు భూములు బీడుగా మారే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు వస్తుందని ఆశతో వరి నాట్లు వేసుకున్నామని గత కొన్ని రోజుల నుంచి నిజాంసాగర్ కాలువ నీళ్ళు విడుదల అయినప్పటికీ తమకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం మండల ప్రజా ప్రతినిధులకు నాయకులకు అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా కనీసం చూసేవారు లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నసురుల్లాబాద్, బీర్కూర్ మండల భూముల్లో తీవ్ర సాగు నీటి ఎద్దడి ఏర్పడింది. నసురుల్లాబాద్ మండలం మిర్జాపూర్ ఆయకట్టు పరిధిలో 200 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. కాలువ ద్వారా నీరు రాకపోవడంతో మిర్జాపూర్ ఊర చెరువు పూర్తి స్థాయిలో నిండక పోవడంతో చెరువు ఆయకట్టు భూములకు సాగునీరు అందక బీడుగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగునీరు వస్తుందని ఆశతో అధిక వడ్డీకి అప్పులు చేసి పంట సాగు చేస్తుండగా అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ పంట పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్జాపూర్ శివారు భూములకు సాగు నీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు. నీటి సరఫరా అంగుళం కూడా మించక పోవడంతో.. సాగు కష్టమవు తొందని అంటున్నారు. ఎలా తమకు ఇదే దుస్థితి ఎదురవు తొందని రైతులు వాపోతున్నారు. పంట ప్రారంభంలోనే ఎండి పోతుందంటంతో ఆందోళన చెందుతున్నారు. ఎండలు పెరుగుతుండటం, శివారు ప్రాంతాల్లో ఇప్పటికే నీటి ఎద్దడి ఎదురవుతుండటంతో గ్రామంలో వరి పంట ఎలా పూర్తవుతుందన్న ఆందోళన సాగుదారుల్లో నెలకొంది. అధికారులు చొరవ చూపి శివారు ప్రాంతాల వరకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## కిడ్నాప్ గురైన బాలుడు.. మోర్తాడ్‌లో లభ్యం



బాలుడిని నిజామాబాద్‌కు తరలిస్తున్న పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు

నవతెలంగాణ-మోర్తాడ్

నిజామాబాద్ నగరంలో కిడ్నాప్‌కు గురైన బాలుడి ఆచూకీ మోర్తాడ్ మండల కేంద్రంలో లభ్యమైనట్లు మోర్తాడ్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గ్రామపంచాయతీకి చెందిన దుర్గయ్య అనే వర్కర్ చెత్తను వదిలేయడానికి సమీపంలో వెళ్లాడు. అక్కడ సంవత్సరం గల పిల్లవాడు ఏడుపు విని ఎవరో ఇక్కడ ఉన్నట్లు గమనించి గ్రామపంచాయతీ అధికారికి సమాచారం ఇవ్వడంతో పంచాయతీ అధికారులు పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి ఆ బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి ఐసిడిఎస్ అధికారులకు అప్పగించారు. గత రెండు రోజుల క్రితం నిజామాబాదులో అదృశ్యమైనట్లు బాలుడిని నిందితులు ఇక్కడ వదిలేసి వెళ్లినట్లు పోలీసులు జిల్లా పోలీసు అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. లభించిన బాలుడిని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్వాడీ వర్కర్ జ్యోతి పోలీసులు ఆ బాలుడిని ఆర్మూర్ ఏసీపీ ఆదేశాల మేరకు నిజామాబాద్ తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- బైక్‌ను వేగంగా వచ్చి ఢీకొన్న కారు
- పెద్దకొడప్‌గల్ మండలం పోచారం గేట్ వద్ద ఘటన




ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన కారు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

బైక్‌ను వేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలంలోని 161వ జాతీయ రహదారిపై పోచారం గేటు వద్ద మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్ఐ కోనారెడ్డి, స్థానికుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు చెందిన వెంకటేష్ సంజాజ్ బన్నుదే (25), వాగ్మోర్ నిఖిల్ (20) తో పాటు సూర్యవంశీ సోనాజీ కలిసి మండలంలోని తలాబ్ తండాలో ఇంటి నిర్మాణం స్లాబ్ వేయడానికి బైక్‌పై వెళ్తున్నారు.

వివరాలు మెయిన్‌లో...

## 'గృహజ్యోతి' అమలుకు విద్యుత్‌మీటర్‌ల అనుసంధానం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గృహజ్యోతి పథకం అమల్లో భాగంగా విద్యుత్‌మీటర్‌లను అనుసంధానం విద్యుత్ శాఖ అధికారులు చేపడుతున్నారు. గృహజ్యోతి పథకం కింద ప్రతి ఇంటికి 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఉపయోగించుకోనుటకు ఏర్పాటు చేసిన గృహ జ్యోతి పథకం అమలు కోసం విద్యుత్ శాఖ అధికారులు ప్రతి ఇంటి వద్ద వచ్చి మీటర్ రీడింగ్ చెక్ చేసే సమయంలో ఆధార్ కార్డు నంబర్ ఆదేవిధంగా రేషన్ కార్డ్ నంబర్ను అనుసంధానం చేపడుతున్నారు. దీంట్లో భాగంగానే నిజామాబాద్ నగరంలో పలు ప్రాంతాలలో వివరాల నమోదును మంగళవారం ప్రారంభించారు. నగరంలో మీటర్ రీడింగ్ తీయుటకు లైన్‌మెన్‌తో పాటు బిల్లింగ్ చేసే వారు కూడా ఉండి అనుసంధానం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ డిఈ ఆపరేషన్ శ్రీనివాసరావు, డిఈ టెక్నికల్ వెంకటరమణ, ఏడిఈ లు తోట రాజశేఖర్, చంద్రశేఖర్, పీరేశం, ఏఏఈ గంగారాం నాయక్, ఏఈలు ఆర్.సుమిత్, నాగ శర్వాణి, నరేష్ తదితర విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పసుపు 'డైరెక్ట్ పర్చేసింగ్' సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వ్యవసాయ మార్కెట్ కమిటీలో డైరెక్ట్ పర్చేసింగ్ సెంటర్‌ను రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఇన్‌స్పెక్టర్ నాజీర్ మంగళవారం శ్రద్ధానంద్ గంజ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సోదరులు పండించిన పసుపు పంటను బాగా ఎండబెట్టి, శుభ్రం చేసి, 18 శాతం మాయిశ్చర్ ఉంటే (డిపిసి) డైరెక్ట్ పర్చేసింగ్ సెంటర్‌లో అమ్ముకునే అవకాశం ఉంటుందని అన్నారు. డైరెక్ట్ పర్చేసింగ్ సెంటర్లో అమ్మకం చేస్తే, ఇక్కడ 2 శాతం కమీషన్ కట్ చేయబోరని తెలిపారు. ఉమ్మడి జిల్లాల మార్కెట్ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి మార్కెట్ కమిటీ పనితీరుపై కార్యకలాపాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటేశం, ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీ అధికారులు గంగు, రమ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గణపతి, ట్రేడర్స్ కమిషన్ ఏజెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ, మోడీ విధానాలను తిప్పికొడదాం

- 16న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలి
- పలు రంగాల కార్మికులకు సీఐటీయూ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న నూర్జహాన్



రవాణా రంగ కార్మికులతో సంతకాల సేకరణ

కేంద్రంలోని బీజేపీ, మోడీ అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెతో తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో పశుమిత్ర ముఖ్యుల సమావేశం నిర్వహించారు. అనంతరం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ప్రాంతంలో కరపత్రాలు పంచుతూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఎన్డీఏ నాయకత్వంలో ఉన్న బిజెపి, మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా దేశం ప్రమాదం లో పడిందని, దేశాన్ని రక్షించుకోవడం కోసమే ఫిబ్రవరి 16 న దేశ వ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మిత్ర జిల్లా అధ్యక్షులు మోహన్ జిల్లా ఉపాధ్యక్షులు మమత నాగమణి రమ్య లక్ష్మి గంగామణి విజయ తదితరులు పాల్గొన్నారు.

**ప్రమాదాల తగ్గింపు పేరుతో.. కార్మికులపై కేసులు**

డ్రైవర్‌లతో మాట్లాడుతూ 'గతంలో ప్రాణాంతకమైన ప్రమాదానికి ఐపీసీలో సెక్షన్ 304(ఎ) ప్రకారం రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ ఉండేవి. కానీ కొత్త చట్టంలో సెక్షన్ 106 (1) & (2)గా మార్పుజరిగిన బిఎన్ఎస్ సెక్షన్ 106(1) ప్రకారం 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా కూడా విధించనున్నారు. ప్రమాదాలను తగ్గించేందుకు మోటార్ వాహన చట్టాన్ని సవరణలు చేస్తున్నామనే పేరుతో కేంద్ర ప్రభుత్వం ఎంవి యాక్ట్-2019ని తీసుకువచ్చింది. చిన్న చిన్న పొరపాట్లకు కూడా వేలాది రూపాయలను జరిమానాలు వసూలు చేస్తూ డ్రైవర్లకు జైలు శిక్షలు కూడా అమలు చేసేందుకు ఆ చట్టం తీసుకొచ్చింది. మొత్తం రవాణా రంగంలోని చిన్న యజమానులు, ఓనర్‌కమ్ డ్రైవర్లుగా ఉన్నవారు జీవించే పరిస్థితి లేకుండా కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తున్నది. కేంద్రం అవలంభిస్తున్న విధానాలను తిప్పికొట్టేందుకు రవాణారంగ కార్మికులు పెద్దఎత్తున సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుధాకర్ ఎస్.కె హైమద్, ఎస్ కె జావీద్, నవీన్, దశరథ్, మోహన్, హైమద్, పాషా, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఆర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షునికి సన్మానం

నవతెలంగాణ-మోపాల్

మంగళవారం ఒలింపిక్ అధ్యక్షులు, అర్చరీ ఫెడరేషన్ ఉపాధ్యక్షులుగా ఎన్నికయిన ఈగ సంజీవ రెడ్డిని ఆయన స్వగృహంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాహెర్‌బిన్ అహ్మద్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తాహెర్ మాట్లాడుతూ తన చిన్నా నాటి మిత్రుడు, మృదుశాలి అయినా సంజీవ రెడ్డి జిల్లా నుండి ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో స్థానం లభించడం జిల్లాకే గర్వకారణమని అన్నారు. కార్యక్రమం లో సెపక్ తక్రా జిల్లా కార్యదర్శి గాధరి సంజీవ్ రెడ్డి, సీనియర్ అథ్లెట్ మార్టిన్ పాల్గొన్నారు.



సంజీవ్‌రెడ్డిని సన్మానిస్తున్న తాహెర్‌బిన్



# ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం సందర్శించారు. త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సి) నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ మేరకు కలెక్టర్ వరుసగా రెండవ రోజైన మంగళవారం సైతం ఈవీఎం గోడౌన్ ను సందర్శించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివిప్యాట్ల పనితీరు పరిశీలన కోసం ఈసీఐఎల్ ఇంజినీర్లు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్‌సి ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించారు. ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని, ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# ఖమ్మం సీపీ సునీల్ దత్ వైఖరిని ఖండించండి

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా
- ఆర్మూర్‌లో పోలీస్ కమిషనర్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/ఆర్మూర్

ప్రజా నేతలపట్ల ఖమ్మం జిల్లా సీపీ సునీల్ దత్ వైఖరిని ఖండించాలని,ప్రజాపంథా నాయకులపై పెట్టిన అక్రమ కేసులుపెట్టి జైలుకు పంపడాన్ని నిరసిస్తూ మంగళవారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పూలాంగ్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎం.నరేందర్, డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న మాట్లాడుతూ.. ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్, సీవై పుల్లయ్య నాయకులు తిమ్మిడి హనుమంతరావు, అరుణోదయ గడ్డం లక్ష్మణ్, జీ.అశోక్, సునావత్ శ్రీనులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రజా నాయకులను నేర ప్రవృత్తి కలిగి ఉన్నారని, రౌడీ షీటర్లని, అమానుష వ్యాఖ్యలు చేసిన ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌పై ప్రభుత్వం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలో పెట్టిన కేసులను సాకుగా చూపి రౌడీ షీటర్ కేసులు పెట్టడాన్ని ప్రజలు ప్రజాస్వామిక వాదులు ఖండించాలని, అక్రమ కేసులో జైలుకు పంపించిన వారిని వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ సహాయ కార్యదర్శి సిహెచ్.సాయగౌడ్, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సంధ్యారాణి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు డి.కిషన్, బి.మురళి, టి.విటల్, డి.కిరణ్, సాయరెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, నగర అధ్యక్షులు అషుర్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబ, నాయకులు పాల్గొన్నారు.

**ఆర్మూర్**-ప్రజా పందా నాయకులను రౌడీ షీటర్స్‌గా మాట్లాడిన ఖమ్మం సీపీ "సునీల్ దత్" వ్యాఖ్యలు ఖండించాలని సిపిఐ ఎంఎల్ నాయకులు వి ప్రభాకర్ అన్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్తు, సిపిఐ, ఎం,ఎల్ ప్రజాపంద(మాస్ లైన్) రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్, సి వై, పుల్లయ్య తదితరులు రౌడీషీటర్స్ అని ప్రకటిస్తూ అక్రమ కేసులు వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా (మాస్ లైన్ )ఆధ్వర్యంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో ప్రజా పంథా డివిజన్ కార్యదర్శి బి దేవరాం, రాష్ట్ర నాయకులు పి రామకృష్ణ, ఇఫ్ట్ జిల్లా అధ్యక్షులు ఏం ముత్తేన్న ప్రజా పందా డివిజన్ నాయకులు ఎస్ సురేష్, బి కిషన్, జి కిషన్, పి డి ఎస్ యు జిల్లా నాయకులు అనిల్, నిఖిల్,మమత, నాయకులు మోహన్, మోహన్, నజీర్ బక్కన్న, తదితరులు పాల్గొన్నారు.




నిజామాబాద్‌సిటీ : నిరసన తెలుపుతున్న నాయకులు

## గ్రామ అభివృద్ధికి పాలకవర్గం కృషి ఎనలేనిది



పాలకవర్గంను సన్మానించిన కార్యదర్శి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామ అభివృద్ధికి సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల కృషి ఎనలేనిదని గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్నో పనులను పూర్తి చేసి ఆదర్శంగా నిలిచారని పలువురు పేర్కొంటున్నారు. మంగళవారం డిచ్ పల్లి మండల కేంద్రంలోని నడ్పల్లి మేజర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ కులచారి సతీష్ రావు, ఉప సర్పంచ్ అజహర్, పాలక వర్గ సభ్యులను మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నిట్టు కిషన్ రావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి నిధులు రాకుండా సర్పంచ్ పాలకవర్గం ముందుండి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. రోడ్లు, మంచినీటి వసతులు, వైకుంఠధామం, డంపింగ్ యార్డ్ నిర్మాణం, హరితహారంతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## విరాళ దాతకు ఘన సన్మానం

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం కోసం మండల కేంద్రానికి చెందిన సీనియర్ కబడ్డీ క్రీడాకారులు 'రిజర్వుడ్' (ఆర్ఐ) ఎస్సై ప్రదీప్ తనవంతు సాయంగా రూ.50 వేల రూపాయలను సోమవారం క్రీడా నిర్మాణ బాధ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా విరాళ దాత అయిన ఎస్సై ప్రదీప్‌ను నిర్మాణ భాద్యులు, పలువురు క్రీడాకారులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.గంగాధర్ మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం నిర్మాణం కోరకు పలువురు ప్రముఖులు, దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.గంగాధర్, రిటైర్డ్ ఉద్యోగస్తులు నునుగొండ అంజయ్య, పీడీ.రాజ్ కుమార్, పుష్పానాథ్ రెడ్డి, టి.సాయన్న, మోతే గంగారెడ్డి, కనకయ్య గౌడ్, నరేష్, హరీష్, ప్రముఖులు పాల్గొన్నారు..

## డీజీపీ రవి గుప్తాని కలిసిన ధన్‌పాల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవి గుప్తాని మంగళవారం మర్యాదపూర్వ కంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారికీ శుభాకాంక్షలు తెలియజేశా రు. అనంతరం నిజామాబాద్‌లో లా అండ్ ఆర్డర్ క్రైమ్‌రేట్ గురించి మాట్లాడారు.



డీజీపికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

## నేడు కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో చైతన్య నెహ్రూ యువజన సంఘం క్రీడా మైదానంలో నిజామాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-16 విభాగంలో కబడ్డీ బాల,బాలికల ఎంపిక పోటీలను బుధవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.గంగాధర్ అన్నారు. ఉదయం 9:30లోపు క్రీడాకారులు చైతన్య నెహ్రూ యువజన సంఘం క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలని కోరారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి సూర్యాపేటలో జరిగే కబడ్డీ పోటీలకు పంపనున్నట్లు వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9440355999, 9989814410 నంబర్లను సంప్రదించాలని సూచించారు..

## టిప్పర్లు రానివ్వకుండా చూడాలి

- తహసీల్దార్, ఎస్ఐకి వినతి

నవతెలంగాణ-మోపాల్

మండలంలో రైతు వేదిక నుండి ట్రిప్పర్లలో తరలిస్తున్న మొరాన్ని ఉదయం 8:30 నుండి 10 గంటల వరకు సాయంత్రం స్కూల్ బస్సులు రిటర్న్ అయ్యే సమయంలో 3:30 నుంచి 5 గంటల వరకు రోడ్డుపైన నడవకుండా చూడాలని డిప్యూటీ తాసిల్దార్ మునిరోద్దీన్, ఎస్సై గంగాధర్‌కు మోపాల్ మాజీ ఉపసర్పంచ్ బిజెపి మండల అధ్యక్షుడు రవికుమార్ మంగళవారం వితనిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సులు, ద్విచక్ర వాహనాలను అని చూడకుండా టిప్పర్ డ్రైవర్లు ఇష్టానుసారం డ్రైవింగ్ చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోనకపోతే రాస్తారోకో చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు 9 పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నిజామాబాద్

జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజారాం స్టేడియం, నాగారంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలలో అండర్ 8 విభాగంలో నాలుగో తరగతి విద్యార్థులు ఎం. ఉదయ్ కుమార్ మూడు గోల్డ్ మెడల్స్, బి.అన్విత మరో గోల్డ్ మెడల్ సాధించారు. ఫరియా ఫాతిమా సిల్వర్ మెడల్, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. మూడవ తరగతికి చెందిన స్నేహిత మరొక సిల్వర్ మెడలు సాధించగా మొత్తం తొమ్మిది మెడల్స్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాల చిన్నారులు కైవసం చేసుకున్నారు. ఉదయ్ కుమార్, ఫరియా వ్యక్తిగత చాంపియన్షిప్‌ని పొందారు. వీటితో ఈరోజు జరిగిన పోటీల్లో ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలకు ఓవరాల్ ఛాంపియన్షిప్ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మామిడాల మోహన్, హెడ్ మాస్టర్ వి. రమణ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

# బ్యాంకు లింకేజీ లక్ష్యం కోసం కృషి చేయాలి



చెక్కును అందజేస్తున్న పీడీ చందర్‌నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బ్యాంకు లింకేజీ లక్ష్యంకోసం కృషి చేయాలని డిఆర్డిఓ డిఆర్డిఎ పిడి చందర్ నాయక్ అన్నారు. ఇందూరు జిల్లా మహిళా పరస్పర సహకార సమాఖ్య 77వ కార్యవర్గ సమావేశం మంగళవారం జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అధ్యక్షతన మండల కేంద్రంలోని ఘన్పూర్ శివారులోని ట్రైజం సెంటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఆర్డిఓ డిఆర్డిఎ పిడి చందర్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ... గత ఆర్థిక సంవత్సరంలాగే ఈ అర్థిక సంవత్సరం (2023-24) లో కూడా బ్యాంకు లింకేజీ లక్ష్యం సాధించడానికి కృషి చేయాలని సూచించారు. నిరుపేదలు సంఘాల్లో సభ్యులుగా లేనివారికి గుర్తించి నూతనంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు ద్వారా వారికి లబ్ది కలిగేలా చూడాలని సూచించారు. బ్యాంకు లింకేజి, స్త్రీనిధి ద్వారా వచ్చే రుణాలను ఉపయోగించకోవడం ద్వారా ప్రభుత్వంద్వారా వచ్చే 35శాతం సబ్సిడీ రుణాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ప్రతి సభ్యురాలు రుణలను తిరిగి చెల్లించే స్తోమతను బట్టి రుణాలు తీసుకుని నూతన యూనిట్ల ఏర్పాటు ద్వారా ఆర్థికంగా అభివృద్ధి పొందాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం స్కూల్ యూనిఫాం, పోలిస్ యూనిఫాం లు కుట్టే అవకాశం, సభలు, సమావేశాల్లో వంటలు చేసే అవకాశంతో పాటు ఖాళీగా ఉన్న వంట ఏజెన్సీలను మాడా మహిళా సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పిడి తెలిపారు. మార్కెటింగ్ ఖరీఫ్, రబి (2022-23) సీజన్‌కు సంబంధించిన (10శాతం) మార్కెటింగ్ కమిషన్ నిధులు రూ.21,97,485 చెక్కును జిల్లా సమాఖ్యకు పిడి చందర్ నాయక్ అందజేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు స్థానానికి ఎన్నిక నిర్వహించి ఆర్మూర్ మండల సమాఖ్య అధ్యక్షురాలు ఈ. రాధ ను జిల్లా సమాఖ్య అధ్యక్షురాలుగా నియమించారు. కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ మధుసూదన, డిపిఎంలు జె. శ్రీనివాస్, సంధ్యారాణి, నీలిమ, ఎం. సాయిలు, మారుతి, రాచయ్య, స్త్రీ నిధి అర్ఎం రాందాస్,ఎపిఎం (ఐబి) సంజని, సఖీ సెంటర్ సిబ్బంది, జిల్లా సమాఖ్య కార్యవర్గ సభ్యులు, జిల్లా సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రికి వినతి

నవతెలంగాణ-జక్రాన్ పల్లి

నిజామాబాద్ జిల్లా పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు పాట్కూరి తిరుపతి రెడ్డి పసుపు రైతుల సమస్యలపై ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి నారాయణ రాణితాటిని మంగళవారం న్యూఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్రం సహకరించి ఎగుమతులు, దిగుమతుల ద్వారా పసుపు పంటకు అధిక మద్దతు ధర వచ్చేటట్లు చూడాలని కోరినట్లు తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటు చేసి రైతులను అన్ని రకాల ఆదుకోవాలని కోరామన్నారు. జిల్లాలోని కమ్మర్ పల్లి, వేల్పూర్, ధర్పల్లి మండలాల్లో ఉన్నటువంటి పరిశోధన కేంద్రాలల్లో సరైన వసతులు కల్పించి రైతులకు అందుబాటులోకి తేవాలని కోరినట్లు చెప్పారు.

## కల్తీ, నాసిరకం అమ్మకాలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఫిబ్రవరి 3, 4 తేదీల్లో జరిగిన రెండు రోజుల వినియోగదారుల జాతీయ సమావేశాలకు నిజామాబాద్ జిల్లా నుండి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, కార్యదర్శి సందు ప్రవీణ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కొనకాల సాయికుమార్ రెడ్డి, బానోతు సందీప్ హాజరైనట్లు తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రైస్ మిల్లులు ప్రభుత్వానికి వినియోగదారులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న విధానాలు, ఆహార కల్తీ, బంగారు వెండి ఆభరణాలలో హానికరమైన కాడ్మియం కల్తీ, నాసిరకం ప్లాస్టిక్ బాటిల్స్‌లో దగ్గు మందుల అమ్మకాలపై నిజామాబాద్ నుండి హాజరైన వినియోగదారుల ప్రతినిధులు, కన్సుమర్ కన్జుమర్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డా.అనంత శర్మకు విన్నవించారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019 పరిధిలో సత్వరమే సంబంధితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వినియోగదారుల జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్, సిపిటిసి ఓ అధ్యక్షుడు శంకర్ లాల్ చౌరాసియా పాల్గొన్నారు.

## రేపటినుండి సీఎం సహాయనిధి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

సిఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులను ఈనెల 07నుండి బుధవారం నుండి తీసుకోనున్నట్టు రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంనుండి మంగళవారం ఒక ప్రకటనల విడుదల చేశారు. పభుత్వ ఆసుపత్రిలో చూడడానికి సౌకర్యం లేదో ఆ రోగానికి మాత్రం ఎల్ఓసి కూడా ప్రభుత్వం నుండి ముందస్తుగా ఇవ్వబడునని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, పేషెంట్ ఐపీ బిల్లు ఒరిజినల్, డిస్ చార్జి సమ్మరీ, ఒరిజినల్ బిల్లులు దరఖాస్తు ఫారం నింపి ఫోటో అతికించి సంతకం చేసి డిశ్చార్జ్ అయిన ఆరు నెలల లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# టిపిటిఎఫ్ విద్యామహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల 11, 12న ఖమ్మంలో నిర్వహించే టిపిటిఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను నిజామాబాద్ మండల కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి రామారావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వాసుదేవరావు, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెనిగల్ల సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. మహాసభలలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దాసరి అనసూయ సీతక్క, ఎంపీలు ఎమ్మెల్యేలు,సదస్సులోఅసమాన సమాజంలో సమానత్వ విద్య, సాధ్యాసాధ్యాలు, అంతరాలు లేని విద్య ప్రజలకు ప్రభుత్వ బాధ్యత, పాసింజం బుద్ధి జీవుల పాత్ర, మహిళల స్థితిగతులు కర్తవ్యాలు, ప్రభుత్వ విధానాలు ఆర్థిక సంక్షోభం, అంతర్జాతీయ పరిస్థితులు ఫలితాల ప్రభావాలు, మొదలగు అంశాలపై సదస్సులు, చర్చాగోష్టులు ఉంటాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఉద్యమాలు, ఉపాధ్యాయ హక్కుల సాధన, ప్రభుత్వ పాఠశాల బలోపేతంపై, తీర్మానాలు ఉంటాయని అన్నారు. పోస్టర్ ఆవిష్కరణ లో టి పి టి ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అరవింద్ కార్యదర్శి మల్లేశం గోపి లింబయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

# కూరగాయల వ్యాపారుల స్థలాలను..

- బంగారు వర్తకులకు కేటాయించడం సరికాదు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వ్యాపార కోణంలో ఆలోచన చేస్తూ బంగారు వర్తకులకు కేటాయించిన స్థలాలను అప్పజెప్పటాన్ని వ్యతిరేకిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ సందర్శనకు వచ్చిన హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ జాయింట్ డైరెక్టర్‌కు గాంధీ గంజిలో రిటైల్ కూరగాయల వర్తకుల సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య మాట్లాడుతూ.. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోగల గాంధీ గంజ్ కూరగాయల మార్కెట్లో రిటైల్ కూరగాయల వర్తకులు 23 సంవత్సరాలుగా వ్యవసాయ మార్కెట్ యార్డ్ ద్వారా లైసెన్సులు పొంది కూరగాయలు అమ్ముతున్నారని అన్నారు. గత ప్రభుత్వం రిటైల్ వారి లైసెన్సులు రెన్యువల్ చేయకపోవడంతో వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, లైసెన్సుల స్థానంలో గతంలో వారి కేటాయించిన అడ్డాలను రెన్యువల్ చేస్తూ వారి దగ్గర కనీస అద్దె వసూలుకు గత ప్రభుత్వం పూనుకుందని అన్నారు. అద్దె చెల్లించడానికి వర్తకులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కానీ ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ వీరికి కేటాయించిన స్థలాలను బంగారు వర్తకులకు అప్పజెప్పటాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రిటైల్ వర్తకులను రోడ్డుమీదికి నెట్టి ప్రైవేటు వ్యాపారస్తులకు స్థలాలను అప్పజెప్పడానికి ఉపసంహరించుకొని వీరికి కనీస అద్దెకు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై జాయింట్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జై భవాని రిటైల్ కూరగాయల వర్తకుల సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షులు లింగం, ప్రధాన కార్యదర్శి కండ్లకోయ గంగ ప్రసాద్, కోశాధికారి సాయిలు, నాయకులు సత్యనారాయణ, సలీం తదితరులు పాల్గొన్నారు.

## మెస్ బిల్లుల్లో అవకతవకలపై విచారణ చేపట్టాలి : ఏబీవీపీ


నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో మెస్ బిల్లులో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వద్ద యూనివర్సిటీ హాస్టల్ సెక్షన్ అధికారుల దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బచ్చనబోయిన శివ మాట్లాడుతూ మెస్ బిల్లుల్లో తప్పుడు లెక్కలు చూయిస్తూ పేద విద్యార్థుల దగ్గర ఫీజుల రూపంలో అధికంగా వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రతినెల విద్యార్థులపై 1200 రూపాయలకుపైగా అక్రమంగా లెడ్జర్ పుస్తకాల్లో రాశారని తెలిపారు. వీటిపై విచారణ చేపట్టి వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, చీఫ్ వార్డెన్ లు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ బిల్లులు రాసిన ఉద్యోగస్తులను శాశ్వతంగా తొలగించాలని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఉపాధ్యక్షులు సాయికృష్ణ, సురేష్, అమృత్, సాయి, సింహాద్రి, మోహన్, మహర్షి వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్మికుడికి రూ. 26 వేల వేతనం ఇవ్వాలి

నవతెలంగాణ-మాక్లూర్

ప్రతి కార్మికుడికి రూ. 26 వేల వేతనం ఇవ్వాలని భారత కార్మిక సంఘాల సమైక్య (ఐ ఎఫ్ టు యు) జిల్లా సహాయ కార్యదర్శి దుడ్డు గంగాధర్ అన్నారు. మండలంలోని మాణిక్ బండర్ చెక్క వద్ద మంగళవారం విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి, ఉద్యోగ భద్రత కల్పించాలని, లేబర్ కోడ్స్ ను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధించాలని అన్నారు. కాంటాక్ట్, జో సోర్సింగ్ కార్మికులను క్రమబుద్ధికరించాలని కోరారు. ఈ డిమాండ్స్‌పై ఈ నెల 8న హైదరాబాద్ లో నిర్వహించే ర్యాలీలో కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు శివరాజ్, జిల్లా నాయకులు సురేష్, లక్ష్మణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

## నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల సర్వసభ్య సమావేశంలో నవతెలంగాణ దినపత్రిక క్యాలెండర్‌ను మంగళవారం ఎంపీపీ కుంచాల విమల రాజు ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ తనుజ శ్రీనివాస్ రెడ్డి మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, మండల కోఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్ నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చైర్ పర్సన్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

అవిశ్వాసం విగిపోవడంతో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలను తీసుకున్న పండిత్ వినితపవన్‌ను ఎస్ఎస్‌కే పట్కరి మహిళా సంఘాల సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. సమాజ్ మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచారు. జిల్లా కేంద్రంలోని రాజారామ్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన తొమ్మిదవ సబ్ జూనియర్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 14 సంవత్సరాల లోపు గర్ల్స్ 100 మీటర్ల పరుగు పందెంలో పి. శ్రావణి రెండో స్థానం, ఎస్. రిషిక మూడో స్థానం సాధించారని ప్రధానోపాధ్యాయురాలు వనజ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పీడి గోపిరెడ్డిని, గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు.

## సాయినాథ్‌కు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ సంస్కృతిక కళ సంస్థ ఆధ్వర్యంలో డిచ్ పల్లి మండల కేంద్రానికి చెందిన వాసరి సాయినాథ్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. తెలంగాణ కళలు సాహితి సంస్కృతి కవులు, కళ కారుల సమ్మేళనం, (అట, పాట, దుందాం )కళ ఉత్సవంలో భాగంగా నిజామాబాద్ జిల్లా కళ బృందం ఈ సందర్భంగా సన్మానించిన వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## పార్టీని పటిష్టం చేద్దాం

- దేగా యాదాగౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పార్టీని పటిష్టం చేద్దామని తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ అన్నారు. మంగళవారం పార్లమెంట్ కమిటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ అభివృద్ధికి కార్యాచరణ ఏర్పాటు చేశారు. నిజామాబాద్ అర్బన్ నూతన కమిటీ 10న శనివారం పార్లమెంట్ జనరల్ సెక్రెటరీ సిహెచ్.హనుమంతరావు ముఖ్యఅతిథిగా, నిజామాబాద్ అర్బన్ ఇంఛార్జి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకోనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గం ఇంచార్జ్ కోట గోపాల్ రెడ్డి, పార్లమెంట్ కమిటీ నాయకులు సిహెచ్ హనుమంతరావు, వీర బ్రహ్మానంద చారి, జ్యోతి నారాయణ, జనార్ధన్ చారి, తెలుగు యువత అధ్యక్షులు శ్రీనివాస్ బాబు, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు సచిన్ పాటేల్, బోధన్ మండల అధ్యక్షులు విట్టల్ రావు, యువ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ రాజధాని అన్నారు. మంగళవారం ఎంపీపీ రాజదాను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలం సమీపిస్తున్న తరుణంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆయన అన్నారు. గ్రామాల్లో ప్రత్యేక శానిటేషన్ చేయాలన్నారు. అదేవిధంగా ఫిబ్రవరి 7 నుంచి 14వ తేదీ వరకు గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన అన్నారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత మాత్రమే వాటిని సంబంధించిన పేమెంట్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపీడీవో రఘు, శ్రీనివాస్, పిఆర్ఏఈ పిచ్చయ్య ఉన్నారు.

## పారిశుధ్య పనులు పరిశీలించిన ఎంపీఓ



**నవతెలంగాణ-భిక్కనూర్**

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో పారిశుధ్య పనులను ఎంపీఓ, గ్రామ ప్రత్యేకాధికారి ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. మురికి కాలువలు, చెత్తచెదారం లేకుండా, దోమల నివారణ కొరకు మంచినీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి దయాకర్‌కు సూచించారు. అలాగే గ్రామ సర్పంచుల పాలన ముగిసిన అనంతరం బస్వాపూర్ గ్రామానికి ప్రత్యేక అధికారిగా నియమితులైన ప్రవీణ్ కుమార్‌ను సిడిసి డైరెక్టర్ మల్లేష్ మల్లారెడ్డి, గ్రామ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇంచార్జి ఎంఈవోలే

- జిల్లాలో ఒక్కరే రెగ్యులర్ ఎంఈవో
- 24 మండలాలకు 8 మంది ఇంచార్జీలే
- ఒక్కొక్కరికి నాలుగైదు మండలాలు
- అదనపు బాధ్యతలతో ఇబ్బందులు
- కొత్త ప్రభుత్వంపైనే కోటి ఆశలు



**నవతెలంగాణ-లింగంపేట్**

కార్పొరేటర్ దిశగా విద్యా బోధన విద్యా వ్యవస్థను నడిపించడానికి గత ప్రభుత్వం ప్రకటనలు తప్ప ఇప్పటివరకు విద్యా వ్యవస్థను రూపకల్పన చేయడానికి మండల విద్యాశాఖ అధికారులను నియమించిన దాఖలాలు లేవు. పది సంవత్సరాలలో మండల విద్యాధికారిని నియమించలేదు. ప్రస్తుతం ఇంచార్జ్ విద్యాధికారులతో విద్యావ్యవస్థ నడుస్తున్నది. ఒక్కొక్కరికి నాలుగు నుంచి ఐదు మండలాలు కేటాయించడంతో అదనపు బాధ్యతలు అప్పగించడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కరువవుతోంది.

కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధనతో పాటు మౌలిక వసతులు విద్యా వ్యవస్థ నడిపించే ఉపాధ్యాయులు మండల స్థాయి విద్యా అధికారులను నియమించడానికి గత ప్రభుత్వం ముందుకు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను రూపకల్పన చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. ఈ ప్రభుత్వం లోనైనా మండల విద్యాశాఖ అధికారులు నియమించే అవకాశాలున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో 1200కు పైగా ప్రాథమిక ఉచ్చతర ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. లక్షకుపైగా మంది విద్యార్థిని విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలో 24 మండలాలున్నాయి. 24 మండలాలకు గానూ 24మంది మండల విద్యాధికారులు ఉండాల్సింది ప్రస్తుతం జిల్లాలో ఎనిమిది మంది ఇన్చార్జ్ మండల విద్యాధికారులుగా పనిచేస్తున్నారు. విద్యావ్యవస్థను చక్కదిద్దాల్సిన మండల విద్యాధికారులు అదనపు మండలాలు అప్పగించడంతో పనిభారంతో సతమతమవుతున్నారు. దీంతో పాఠశాలపై సరైన పర్యవేక్షణ లేక ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రయివేట్ పాఠశాలలో దోపిడీ నియంత్రణ అరికట్టాల్సిన మండల విద్యాధికారులు రోజువారీగా ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలాలు తిరుగుతున్నందుకు కాలం గడిచిపోతోంది. మరోవైపు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వాటిని పర్యవేక్షించడం లేదని విమర్శలు వస్తున్నాయి.

**జిల్లాలో ఒకే ఒక్కడు..**

కామారెడ్డి జిల్లాలో 24 మండలాలున్నాయి. ఆయా మండలాల్లో ఎనిమిది మంది ఇన్చార్జి ఎంఈవోలుగా పనిచేస్తున్నారు. గాంధారి మండలంలో మండల విద్యాధికారిగా పనిచేస్తున్న సేవల నాయక్ రెగ్యులర్ ఎంఈఓగా ఉండగా.. మిగతా అన్నిచోట్ల సంబంధిత ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు విద్యాధికారి బాధ్యతను అప్పగించారు.

**సమావేశాలతో సరి..**

విద్యార్థులను బలోపేతం చేయడానికి మండల విద్యాధికారి ప్రముఖ పాత్ర పోషించాల్సి ఉంది. ఒక్కొక్కరికి నాలుగు మండలాలకు అదనపు బాధ్యతలు ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండల పరిషత్ సమావేశం, ప్రభుత్వ కార్యక్రమ కాంప్లెక్స్ సమావేశం, జిల్లాస్థాయి సమావేశ తదితర సమావేశాలకు హాజరుకావాల్సి ఉంది. ప్రతి నెల పాఠశాలకు సంబంధించిన బిల్లులు, మధ్యాహ్న భోజనం బిల్లులు, ప్రభుత్వ పథకాలు అమలు, పాఠ్యపుస్తకాలు, పరీక్ష పత్రాలు, పదో తరగతి ప్రత్యేక తరగతులు, ఉత్తీర్ణత శాతంపై ఎప్పటికప్పుడు పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. కానీ అదనపు భారంతో ప్రస్తుతం ఇంచార్జి ఎంఈవోలు ఇబ్బందులు పడుతున్నారు.

### న్యాయం చేస్తున్నాం

మూడు మండలాలు బాధ్యతలు అప్పగించారు. సాధ్యమైనంతవరకు బాధ్యతలను నిర్వర్తిస్తున్నాం. ఎప్పటికప్పుడు పాఠశాలలను సైతం సందర్శిస్తున్నాం. అదనపు బాధ్యతలతో ఇబ్బందులు పడుతున్నాం.
**- రామస్వామి, మండల విద్యాధికారి**

### సతమతమవుతున్నాం

అదనపు బాధ్యతలతో సతమతమవుతమన్నాం. ఓ వైపు పాఠశాలలను తనిఖీ చేయడం, మరోవైపు సమావేశాలతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలి.
**- వెంకటేశం, విద్యాధికారి, ఎల్లారెడ్డి**

## గ్రామాలను అభివృద్ధి చేశారు..



వార్డు సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

**నవతెలంగాణ-బోధన్**

గ్రామపంచాయతీ వార్డు సభ్యులుగా, సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాలను అభివృద్ధి చేసి గ్రామ ప్రజలలో వారు మర్చిపోలేని గుర్తింపును సాధించారని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి అన్నారు. మంగళవారం సాలూర గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఆమె ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాజకీయాలలో ప్రజలకు సేవలు అందించడానికి వార్డు సభ్యుడు అనేది మొట్టమొదటి పదవి అని దానిని సమర్థవంతంగా నిర్వహించిన వారు భవిష్యత్తు రాజకీయాలలో మంచి గుర్తింపు సాధిస్తారని అన్నారు. అంతేకానీ నిరాశపడి వెనకడుగు వేయవద్దని సూచించారు. భవిష్యత్తులో రాజకీయాలలో ఉన్నా లేకున్నా ప్రజలకు సేవ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ మల్లయ్య, మాజీ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్, ఐడిసిఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, మాజీ సొసైటీ చైర్మన్ శివకాంత్ పాటిల్, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ షకీల్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగడి పాండు, గ్రామ పెద్దలు దత్తు, శివప్ప పటేల్, ఖదీర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, పలువురు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నూతన సీఐకి ఘన సన్మానం



సీఐను సన్మానిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-నసురుల్లాబాద్**

బాన్సువాడ పట్టణ రూరల్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణకు బీర్కూర్ మండల బైరపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గ్రామస్తులు బాన్సువాడ రూరల్ సిఐ సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సీఐ సత్యనారాయణకు ఘనంగా శాలువా కప్పి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సత్యనారాయణ సిఐ మాట్లాడుతూ.. ప్రజల శ్రేయస్సు కోసం 24గంటలు అందుబాటులోనే ఉంటానని ఏదైనా ఆపద వస్తే, అవసరమైతే అర్ధరాత్రి కూడా ఫోన్ చేయవచ్చని తెలిపారు. సన్మాన కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు కుర్మా మొగులు గొండ, బీర్కూర్ మాజీ వైస్ ఎంపిపి నారాయణ, బీర్కూర్ మండల రైతు సమన్వయ సమితి మెంబర్ సంజీవ్ కుమార్, బైరపూర్ మాజీ సర్పంచ్ గొర్రెపాటి జ్యోతి రాంబాబు పాల్గొన్నారు.

## సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సన్మానం



సర్పంచ్, ఉపసర్పంచ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ.. గత 5 సంవత్సర క్రితం గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన నాటి నుంచి నేటివరకు తమ తమ గ్రామ ప్రజలకు సేవలు అందించి గ్రామానికి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేసిన ఘనత గ్రామ సర్పంచ్, పాలకవర్గానిదేనని తెలిపారు. అనంతరం ఎంపీపీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ 5 సంవత్సరాల పాటు గ్రామ ప్రజలకు సేవలు అందించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు శాలువాలతో సన్మానించి మిఠాయిలు పంచిపెట్టారు. సన్మానం పొందిన సర్పంచ్, ఉపసర్పంచ్‌లు, అధికారులకు, పంచాయతీ కార్యదర్శిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాణి, ఎంపిఓ సూర్యకాంత్, తహసీల్దార్ దశరథ్, సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మండల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఆఫీసర్‌కు సన్మానం

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

నాగిరెడ్డిపేట్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బి.లక్ష్మణ్ మండలంలోని అక్కంపల్లి గ్రామపంచాయతీ స్పెషల్ అధికారిగా బాధ్యతలు తీసుకోవడంతో మంగళవారం గ్రామస్తులు తహసీల్దార్ లక్ష్మణ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏఎంసి డైరెక్టర్ దివిటీ కిష్టయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## హలో బీసీ.. చలో ఢిల్లీ

- పార్లమెంట్ ముట్టడి, జాతీయ ఓబీసీ మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నవతెలంగాణ-కామారెడ్డి**

జిల్లా కేంద్రంలోని బీసీ కళాశాల వసతి గృహంలో జరిగిన సమావేశంలో హలో బీసీ చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజ్ మాట్లాడుతూ.. దేశంలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు లేని సామాజికవర్గం కేవలం బీసీలేనని అన్నారు. ఇటీవలే నూతనంగా ప్రవేశపెట్టిన అగ్రవర్ణ రిజర్వేషన్లను, ఇ.డబ్ల్యు.ఎస్. రిజర్వేషన్లు వారి జనాభా కంటే రెండు, మూడు శాతం అధికంగానే కల్పించారన్నారు. జాతీయ జనగణనలో బీసీ కులాల గణన చేపట్టాలని, బీసీలు ఎంత మొత్తుకున్నా కేంద్ర ప్రభుత్వానికి చెవికెక్కడం లేదని తెలిపారు. బీసీ గణన లేకుంటే బీసీల అస్తిత్వమే లేదన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీల వాటా బీసీలకే దక్కాలన్నారు. దేశంలో రిజర్వేషన్లు పొందుతున్న ఏ వర్గానికి లేని క్రిమిలేయర్ ఒక్క బీసీలపైనే అమలు చేస్తున్నారని, దీనివల్ల బీసీలకు దక్కాల్సిన 27శాతం రిజర్వేషన్లు సంపూర్ణంగా దక్కడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో ప్రస్తుతం 72 మంత్రిత్వ శాఖలు ఉంటే 60 కోట్ల మంది బీసీల సంక్షేమానికి మాత్రం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం దారుణమన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకి సబ్ కోటా దక్కాలని అన్నారు. దేశవ్యాప్తంగా జరిగే జనగణనలో బీసీల గణన చేపట్టాలని, చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం బీసీల రిజర్వేషన్లు పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో ఢిల్లీలో ఫిబ్రవరి 8న పార్లమెంట్ ముట్టడి, 9న ఓబీసీ జాతీయ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దేశంలోని బీసీలందరూ పెద్దఎత్తున తరలివచ్చి ఢిల్లీలో బీసీల సత్తా చాటాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్, మహేష్, నాయకులు అవినాష్, రాహుల్, మణికంఠ, సాయి కిరణ్, కృష్ణ, గణేష్, విష్ణు, రక్షిత్, అరవింద్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- ఎస్ఐ సుధాకర్



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

**నవతెలంగాణ-రామారెడ్డి**

వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎస్ఐ సుధాకర్ వాహనదారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని గంగమ్మ వాగువద్ద వాహనాల తనిఖీని సుధాకర్ ఆధ్వర్యంలో చేపట్టారు. పలు వాహనదారు రోడ్డు భద్రత నియమాలు పాటించని వారిపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టులను ధరించాలని, వాహన ధ్రువపత్రాలతోపాటు లైసెన్సులను కలిగి ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు నడపడానికి ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది చందు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్‌గౌడ్ డిమాండ్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-కామారెడ్డి**

కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో కల్లు గీత కార్మిక సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన 6 గ్యారంటీలతో పాటు ప్రత్యేకంగా గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో వృత్తిలో ప్రమాదం జరిగి చనిపోయిన వారి కుటుంబాలకు గ్రామపంచాయతీ తీర్మానం ఆధారంగా ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలు, 30రోజులలోపు ఇస్తామని హామీనిచ్చారని, జనగాం జిల్లాకు పాపన్న జిల్లాగా పేరు మారుస్తామని తెలిపారు. పెన్షన్ ప్రస్తుతం ఇస్తున్న గీత కార్మికులతో పాటు 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికునికి 4,000లు చేయూత పెన్షన్ ఇస్తామని, బెల్ట్ షాపులు రద్దు చేస్తామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వాటిని అమలు చేయాలని వారు కోరారు. ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహం నెలకొల్పడం, గీత కార్మికుల ఉపాధి మెరుగుపరచడం, కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించి బలోపేతం చేయడం, వృత్తిలో ప్రమాద నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, కార్పొరేషన్ నుంచి ఇచ్చే ఆర్థిక సహాయం వెంటనే ఇవ్వాలని, ప్రతి కల్లు దుకాణానికి ఐదెకరాల భూమి, కల్లుగీత కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారులు నారాగౌడ్, రవిగౌడ్, సాయగౌడ్, రమేష్‌గౌడ్, స్వామిగౌడ్, చాణక్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రుణం తీసుకునే ప్రతి ఒక్కరూ ప్రమాద బీమా చేసుకోవాలి

- శ్రీరామ్ చిట్స్ డివిజనల్ మెనేజర్ కె.భాస్కర్ రావు



బీమా చెక్కును అందజేస్తున్న మేనేజర్

**నవతెలంగాణ-బోధన్**

శ్రీరామ్ చిట్స్‌లో రుణం పొందేవారు తప్పనిసరిగా ప్రమాద బీమా చేసుకోవాలని బోధన్ శ్రీరామ్ చిట్స్ డివిజనల్ మేనేజర్ భాస్కర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన శ్రీరామ్ చిట్స్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి ప్రమాద బీమా చెక్కును అందించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామ్ చిట్స్‌లో రుణాలు పొంది ఆర్థిక అవసరాలు తీర్చుకునేవారు కుటుంబాల అవసరాల కోసం ప్రమాద బీమా చేసుకొని లబ్ధిపొందాలని సూచించారు. అలాగే శ్రీరామ్ చిట్స్‌లో పొదుపు ప్రజల ఆర్థిక అవసరాలకు భరోసా అని పేర్కొన్నారు. అనంతరం ఆయన రాజీవ్‌నగర్ తండా గ్రామానికి చెందిన కేతావత్ బుజ్జి బాయ్‌కు చెక్కు అందించి ఆదుకున్నారు. రాజీవ్‌నగర్ తాండా గ్రామానికి చెందిన కేశవత్ రవి బోధన్ పట్టణంలోని శ్రీరామ్‌చిట్స్‌లో ఆయన సతీమణికి చెందిన ఐదు గ్రాముల బంగారాన్ని కుదువపెట్టి 15 వేల రూపాయల నగదును రుణంగా తీసుకున్నారు. గోల్డ్ లోన్ తీసుకునే సమయంలో ఆయన 104/- రూపాయల ఇన్సూరెన్స్ చెల్లించి ఆయన భార్య బుజ్జిబాయిని నామినిగా ఉంచారు. ఈ క్రమంలో ఆయన ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి 40 వేల రూపాయల ప్రమాద బీమా మంజూరైంది. ఈ డబ్బులలో 25 వేల రూపాయలను నామినిగా ఉన్న ఆయన భార్య కేతావత్ బుజ్జి ఖాతాలో జమ చేసిన శ్రీరామ్ చిట్స్ డివిజన్ మేనేజర్ భాస్కరరావు, గోల్డ్ లోన్ ఆమెకు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు శ్రీరామ్ చిట్స్ అధికారులకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె.సంతోష్, గోల్డ్ ఎగ్జిక్యూటివ్స్ ఎ.రాజు, శివకుమార్ పాల్గొన్నారు.

## పిఎసిఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం



అవిశ్వాస తీర్మానంలో పాల్గొన్న పలువురు

**నవతెలంగాణ-లింగంపేట్**

మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి పీఏసీఎస్ చైర్మన్ సుకన్య అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండారు కృష్ణారెడ్డిపై డైరెక్టర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం మేరకు మంగళవారం నిర్వహించిన అవిశ్వాస బలపరీక్షలో తగిన సంఖ్యాబలం లేకపోవడంతో విగిపోయింది. వివరాలిలా ఉన్నాయి.. గత 15 రోజుల క్రితం పదిమంది పిఏసిఎస్ డైరెక్టర్లు చైర్మన్ సుకన్య అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండారు కృష్ణారెడ్డిపై డిసిఓ శ్రీనివాస్‌కు అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఫిర్యాదు చేశారు. డైరెక్టర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం శెట్టిపల్లి సంగారెడ్డిలోని పిఏసిఎస్ కార్యాలయంలో అవిశ్వాస బలపరీక్షను ఏర్పాటు చేశారు. ఈ అవిశ్వాస బలపరీక్షకు కేవలం ఏడుగురు డైరెక్టర్లు, మంగలి లక్ష్మీనారాయణ, మాలోత్ నాబ్యా, బోదునపు విఠల్, జంగం రాములు, తోట భాగ్యలక్ష్మి, మెడికుంద రాందాస్, అర్కరి కవిత మాత్రమే హాజరుకావడంతో తగిన సంఖ్యాబలం లేక అవిశ్వాసం వీగిపోయినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో చైర్మన్ సుకన్య అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండారు కృష్ణారెడ్డికి పదవి గండం తప్పింది. అవిశ్వాస తీర్మానం సందర్భంగా భారీ బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిసిఓ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు భూమయ్య, ప్రశాంత్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, సీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చిత్రపటం పెట్టాలి



**నవతెలంగాణ-వర్ని**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాటు చేయాలని మండల అధ్యక్షులు సురేష్ బాబా డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ తహశీల్దార్ నారాయణకు వర్ని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కులకర్ణి సురేష్ బాబా చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు శంషుద్దీన్, కిసాన్ ఖేత్ మండలాధ్యక్షులు శనిగరం కిషన్, సేవాదళ్ మండలాధ్యక్షులు హనుమంతరావు, మండల ప్రధాన కార్యదర్శి రూప్‌సింగ్, పండరి నాయక్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## 29న బోధన్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన

**నవతెలంగాణ-బోధన్**

బోధన్ పట్టణ నడిబొడ్డున చావిడి సమీపంలో ఫిబ్రవరి 29వ తేదీన హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బోధన్ గ్రామ అభివృద్ధి కమిటీ ప్రముఖులు మంగళవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షులు బాగారెడ్డి మాట్లాడుతూ.. పురాతన కాలం నుంచి చావడి సమీపంలో ఉన్న హనుమాన్ మందిరం శిథిలావస్థకు చేరడంతో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నూతన ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఈ ఆలయంలో ఫిబ్రవరి 29వ తేదీన నూతన హనుమాన్ మందిర విగ్రహం ఘనంగా ప్రతిష్ఠిస్తున్నామని తెలిపారు. అలాగే మార్చి 1,2 తేదీల్లో ఘనంగా ప్రత్యేక పూజలు, మహాయజ్ఞం, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కావున ఈ మూడు రోజులపాటు జరిగే ఈ మహోత్సవ భక్తి కార్యక్రమంలో భక్తులు, పట్టణవాసులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## రికార్డులు తనిఖీ చేసిన ఆర్డీవో

**నవతెలంగాణ-బాల్కొండ**

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను ఆర్మూర్ ఆర్డీవో వినోద్ మంగళవారం తనిఖీ చేశారు. పద్మ శాలి కులస్తులు సర్వే నంబరు 1181 బాల్కొండ శివారులో గల భూమికి సంబంధిన సమస్యను తహసిల్దార్ శ్రీధర్ ఆర్డీవో దృష్టికి తీసుకెళ్ళారు. మండలంలో గల ప్రభుత్వ భూములను కాపాడాలని అధికారులను అదేశించారు. ప్రభుత్వ భూమి సర్వే నంబరు 1333 ను కొలిచి హద్దులు నిర్ణయించడానికి నిజామాబాద్ కలెక్టర్ నలుగురు సర్వేయర్లను డిప్యుట్ చేశారని తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీధర్, ఆర్ ఐ రాఘవేందర్ తదితరులు ఉన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

## 78 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు గైర్హాజరు

**నవతెలంగాణ నిజామాబాద్ సిటీ**

జిల్లాలో ఇంటర్మీడియట్ జనరల్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ తెలిపారు. మంగళవారం ఉదయం జనరల్ మొత్తం 1,302మంది విద్యార్థులకు గాను 1,255 మంది హాజరుకాగా 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు అన్నారు. ఒకేషనల్ 592 మందికి గాను 537 మంది విద్యార్థులు హాజరు కాగా 55 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జనరల్ విద్యార్థులు 899మందికి గాను 868 మంది హాజరుకాగా 31మంది గైర్హాజరయ్యారని అన్నారు. ఒకేషనల్‌లో మొత్తం 442 మంది విద్యార్థులకు గాను 407 మంది విద్యార్థులు హాజరు కాగా 35 మంది విద్యార్థులు గైర్ హాజరు అయ్యారని తెలియజేశారు. ఇంటర్ విద్యాధికారి ఆరు పరీక్ష కేంద్రాలను, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, రాజీయూదిన్ అస్లాం, దేవారం, హై పవర్ డాక్టర్ చిరంజీవి, ఫ్లైయింగ్ స్క్వాడ్ 26 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణను సమీక్షించారు.

## 16వరకు ఎంఈడ్ థియరీ పరీక్ష ఫీజుకు గడువు

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడ్ మూడవ సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షల ఫీజు ఈనెల 12 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చునని, 100 రూపాయల అపరాధ రుసుముతో 16 వరకు చెల్లించాల్సి ఉంటుందని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పూర్తి వివరాలకు www.telanganauniversity.ac.inతెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్‌ను సందర్శించాలని వివరించారు.

## నేటినుండి పారిశుధ్య వారోత్సవాలు

**నవతెలంగాణ-భీంగల్**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 7 నుండి 14 వరకు మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ మంగళవారం తెలిపారు. ప్రతి గ్రామానికి నియమింపబడ్డ ప్రత్యేక అధికారి గ్రామంలోని అన్ని వర్గాల వారిని సమన్వయంతో భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని పేర్కొన్నారు. అలాగే ఈనెల 15న గ్రామ సభలు నిర్వహించి సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

## భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : ఆర్డీవోకు వినతి

**నవతెలంగాణ-ఆర్మూర్**

ఆలూర్ మండలంలోని గగ్గుపల్లి గ్రామంలో ఐదు ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో వినోద్ కుమార్ కు మంగళవారం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 148 బై 2,146 లో కొన్ని ఎకరాల భూమిని గ్రామంలోని పాడి పశు పోషణ కొరకు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. గతంలోనూ ఈ భూమిని వేరే వారు అక్రమంగా వారి పేరున రెవెన్యూ రికార్డులో నమోదు చేసుకొని సాగు చేసుకోవడానికి వచ్చినప్పుడు గ్రామస్తులందరూ అడ్డుకున్నట్లు చెప్పారు. హైదరాబాదులో ఉంటున్న యమ్మారెడ్డి ఇటీవల సాగు చేసుకోవడానికి రాగా గ్రామస్తులందరూ అడ్డుకున్నారన్నారు. దీనిపై విచారణ జరపాలని ఆర్డీవోను కోరినట్టు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

## కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్


నివాళ్లు అర్పిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్, తదితరులు

**నవతెలంగాణ-ఆర్మూర్**

బోధన్ నియోజకవర్గంలోని కల్దుర్కి సొసైటీ చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ శరత్ మాతృమూర్తి ఇటీవల మృతిచెందారు. తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి మంగళవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ గిర్ధవర్ గంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**కార్మిక సంఘాల జేఏసీ పిలుపు**


సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె - గ్రామీణ భారత్ బంద్ ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ కోరింది. నిజామాబాద్ నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో మంగళవారం సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ, సీఐటీయూ సంఘాల బాధ్యులు ఎం.సుధాకర్, వై.ఓమయ్య, నూర్జహాన్, జీ.భూమయ్య, పి.వరదయ్య మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం తొమ్మిదిన్నర సంవత్సరాలుగా దేశ ప్రజలకు, కార్మిక వర్గానికి చేసిందేమీ లేదన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ 04 కార్మిక వ్యతిరేక కోడ్ లను తీసుకువచ్చిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించిందన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటించాలన్నారు. సమ్మెలో భాగంగా ఈనెల 16న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుండి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ ర్యాలీ బహిరంగలో జిల్లాలోని కార్మికులు, రైతులు, రైతు కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష కార్మిక సంఘాల నాయకులు నర్సింగరావు, శివకుమార్, రాములు, లింగం, శివరాజ్, సురేష్, సాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 16న భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాపిత కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ ను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు జిల్లా కార్యదర్శి మురళీ మోహన్ అన్నారు. కేంద్ర బిజెపి కార్పొరేట్, మతతత్వ విధానాలను, వైఫల్యాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16న దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు ఐక్యంగా కార్మికుల పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం నిజామాబాద్ నగరంలోని ఎన్ఆర్ భవన్ కోటగల్లిలో సమ్మె గ్రామీణ భారత్ బంద్ పోస్టర్‌ను అవిస్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు రమేష్ అరుణ్ సురేష్ రాజు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డికి బాల్కసుమన్ క్షమాపణ చెప్పాలి

- సీఎంపై చేసిన వ్యాఖ్యలకు భగ్గుమన్న కాంగ్రెస్ నాయకులు
- పోలీసులకు ఫిర్యాదు
- దిష్టిబొమ్మల దహనం

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ జిల్లాలో బాల్కసుమన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన దిష్టిబొమ్మలను దహనం చేశారు.

**నవతెలంగాణ-విలేకరులు**


సిరికొండ: దిష్టిబొమ్మకు చెప్పుతో కొడుతున్న నాయకులు


భీంగల్‌రూరల్ : ఫిర్యాదు చేస్తున్న నాయకులు

**సిరికొండ:** మండల కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి, నాయకుల ఆధ్వర్యంలో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి రెండు పథకాలను అమలు చేసి మరో రెండు పథకాలను ప్రకటించడంతో బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు.

**కమ్మర్‌పల్లి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే అర్హత ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి అన్నారు. ప్రశాంత్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని... రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. మండల కేంద్రంలోని హాస కొత్తూర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.

**ఆర్మూర్:** మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి ఒక దొంగ, ఆయనకు మాట్లాడే హక్కు లేదని, నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని వేల్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డి ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత్ రెడ్డి చేసిన పనులపై ప్రభుత్వం విచారణ జరిపిస్తుందని, ప్రశాంత్ రెడ్డి ఇక తప్పించు కోలేడని తెలి పారు. బాల్క సుమన్‌ను ప్రజలు చెప్పుతో కొట్టి ఇంటికి పొమ్మని ఎన్నికల్లో ఓడగొట్టినా బుద్ధి రాలేదని అన్నారు.

**మెండోర :** మండల పార్టీ అధ్యక్షుడు కోత్తింటి ముత్యం రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్లో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు చేశారు.

**బాల్కొండ:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచితంగా మాట్లాడిన బాల్క సుమన్ వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గున్నాల వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉండి బాల్కొండ నియోజకవర్గనికి ఇండ్లు ఇప్పియ్యలేని అసమర్థ మంత్రిగా ప్రశాంత్‌రెడ్డి మిగిలిపోలేదా అని అన్నారు. దళితులకు మూడెకరాల హామీ, దళిత బంధు విషయంలో ఏనాడు మాట్లాడని బాల్క సుమన్ ఇవాళ అధికారం పోయేసరికి పిచ్చి పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

**జక్రాన్‌పల్లి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు.

**భీంగల్ :** చెన్నూరు మాజీ ఎమ్మెల్యే ,టిఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ సీఎం రేవంత్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని లేకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తగిన బుద్ధి చెప్తామని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేంద్ర అన్నారు.భీంగల్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు.

**డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత బిఆర్ఎస్‌దేనని అన్నారు. ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్ర పునర్ నిర్మాణంలో ముందుకు పోతుంటే దాన్ని జీర్ణించుకోలేని కల్వకుంట్ల మిడతల దండుతో బానిసలతో తెలంగాణలో అలజడి సృష్టించాలని చూస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, అమృత పూర్ గంగాధర్, డాక్టర్ శాదుల్లా, జంగిలి లక్ష్మి, వెంకట్ రెడ్డి,కర్స మోహన్, ఆశిష్ పాల్గొన్నారు.

**భీంగల్ రూరల్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బల్క సుమన్‌పై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోధిరే స్వామి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎస్ఐకి వినతిపత్రం అందజేశారు.

**ముప్కాల్:** మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.


ముప్కాల్ : మాట్లాడుతున్న నాయకులు

# 16న గ్రామీణబంద్‌ను జయప్రదం చేయాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాలు

**నవతెలంగాణ-కంఠేశ్వర్/మాక్లూర్**

కార్మిక సంఘాలు ఫిబ్రవరి 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల నాయకులు కోరారు. మంగళవారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష - కార్యదర్శులు గంగాధరప్ప- వెంకటేశ్, నాయకులు దేవేందర్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ... ఉపాదిహామీ పథకాన్ని రద్దు చేసే కుట్ర చేస్తూ కార్పొరేట్ వ్యవస్థలకు మాత్రమే పెద్దపెట్టవేస్తుందని తెలిపారు. మొన్న పార్లమెంట్లో నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దాన్నే రుజువు చేస్తుందన్నారు. మతోన్మాద విధానాలను దేశ ప్రజలపైన రుద్దుతూ, యువతను దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయకుండా మూడ విశ్వాసంలో ముంచి తేలుస్తున్నారని తెలిపారు.కార్మిక చట్టాలను కాపాడాలని దేశంలోని కార్మిక సంఘాలు ఈనెల 16న గ్రామీణ బంధుకు పిలుపునిచ్చాయని అన్నారు. వారికి రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ఎస్ కే యం (కిసాన్ సంయుక్త మోర్చా)లు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయి. ఈకార్యక్రమం జయప్రదం చేయాలని రైతాంగానికి, శ్రామిక ప్రజలకు, ఉపాధి కూలీలకు పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న పెద్ది వెంకట్రాములు

**నవతెలంగాణ - మాక్లూర్**

ఈ నెల16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ కు సీపీఎం పూర్తి మద్దతు ప్రకస్తిస్తుందని సిపిఎం మండల కార్యదర్శి కొండగంగాధర్ తెలిపారు. మంగళవారం మండలంలోని దాస్ నగర్ వద్ద బంద్ కు సంబంధించిన పోస్టుల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌కు సంపూర్ణ మద్దతుగా మండల కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. కార్యక్రమంలో దాస్‌నగర్ సాయిలు, బండారి ఎల్లయ్య, రాజు, మోహన్ పాల్గొన్నారు.

## రైతు, ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసించండి

- సిపిఐఎంఎల్ మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రభాకర్

**నవతెలంగాణ-ఆర్మూర్**

కేంద్ర ప్రభుత్వ ఓటాన్ అకౌంట్ రైతు, ప్రజా వ్యతిరేకమైన బడ్జెట్ ను నిరసించాలని సిపిఐ ఎంఎల్‌ఓ మస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి వి.ప్రభాకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఈ నెల 16 న బంద్ పిలుపు సందర్భంగా పట్టణంలో మంగళవారం మస్ లైన్ పార్టీ అఫీస్ కుమార్ నారాయణ్ భవన్ లో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఎండమావిలో నీరు వెతుకునట్లుగా ఉందని అన్నారు. అధికారం లోకి వచ్చిన బిజెపి గత పది వార్షికబడ్జెట్లను పరిశీలిస్తే.. వ్యవసాయ రంగానికి.. విద్యా, వైద్య, నిరుద్యోగ యువతకు కేటాయింపుల్లో భారీగా తగ్గిస్తుందని తెలిపారు. కొన్ని పద్దులు కేటాయించి నట్టు బడ్జెట్లో చూపిస్తూ ఖర్చు చేయకుండా మిగులు చూపించినవి కూడా ఉన్నాయని అన్నారు. డివిజన్ కార్యదర్శి బి దేవారం మాట్లాడుతూ వ్యవసాయ,, అనుబంధ రంగాలకు బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తూ తన రైతు వ్యతిరేక కార్పొరేట్ అనుకూల వైఖరిని చాటుకుంటుందని తెలిపారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, ఎం, ముత్తెన్న.. కమ్మర్ పల్లి కార్యదర్శి సార సురేష్, సబ్ డివిజన్ కార్యదర్శి బి.కిషన్ నాయకులు రాజన్న, ఆకుల గంగన్న, టాగూర్, తదితరులు పాల్గొన్నారు.

## మెంట్రాజ్‌పల్లి సొసైటీలో విచారణ

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

మండలంలోని మెంట్రాజ్ పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) ఆధ్వర్యంలో జరిగిన వరి ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని డైరక్టర్ రాగం గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం జిల్లా సహకార అధికారులు విచారణ జరిపారు. విచారణ అధికారి జిల్లా సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి. పోషన్న, మానిటరింగ్ అధికారి ఆనంద్ సొసైటీ కార్డులను పరిశీలించారు. అనంతరం సొసైటీ పరిధిలోని అమృతాపూర్ గ్రామానికి వెళ్లి గతంలో కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం విక్రయించిన రైతులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. 2019 నుంచి 2023 వరకు సొసైటీ పరిధిలో జరిగిన ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని, కడ్తా, హమాలీ పేరుతో సుమారు రూ.2కోట్ల వరకు అవినీతికి పాల్పడ్డారని డైరక్టర్ రాగం గంగాధర్ అధికారులతో పేర్కొన్నారు. సొసైటీ లో ఎలాంటి అక్రమాలు జరగలేదని, కేవలం రాజకీయ కక్షతోనే కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అక్రమాలు జరిగినట్లు తేలితే తానే పూర్తి భాధ్యత వహిస్తానని సొసైటీ చైర్మన్ చింత శ్రీనివాస్రెడ్డి పేర్కొన్నారు.

# ప్రత్యేక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తా

- నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్ రెడ్డి

**నవతెలంగాణ-ఆర్మూర్**

ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులను తెచ్చి ఆర్మూర్ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల హామీలను-ఆరు గ్యారంటీలను అమలు చేసే ప్రక్రియ ప్రారంభం అయిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డి అన్నారు. మస్జీద్ కమిటీల సమస్యల పరిష్కారంతోపాటు నియోజక ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. నందిపేట్-డొంకేశ్వర్ మండల ముస్లిం కమిటీ నాయకులు మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నందిపేట్- డొంకేశ్వర్ గ్రామాల యొక్క ఉమ్మడి కమిటీ అధ్యక్ష- ఉపాధ్యక్షులను శాలువాలతో సన్మానం చేసిన అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షులతో, మండల కమిటీ సభ్యలతో మాట్లాడి గ్రామ సమస్యలు- మస్జీద్ కమిటీ వివరాలు తెలుసుకొన్నారు. కార్యక్రమంలో నందిపేట్-డొంకేశ్వర్ మండల ముస్లిం కమిటి అధ్యక్షుడు మొహమ్మద్ జావేద్ ( ఖుదాన్పూర్), ఉపాధ్యక్షులు- షేక్ మెయిన్(మల్లరం), షేక్ ఫరిద్ (తొండకూర్) కోశాధికారి మహిమూద్ (తల్వెద), ఈ సి మెంబర్ లు సాదుల్లాహ్( అయిలపూర్), డా. గుడుసాబ్ (దేవిపట్టనం) రసూల్ ( రైతు ఫారం) చంద్ పాషా (నికాల్పూర్) వహీద్( నూత్పల్లి) వివిధ గ్రామాల మస్జీద్ కమిటీ అధ్యక్షులు ఇమ్రాన్ (మల్లరం) షేక్ గౌస్( మస్జీద్ మౌజ బింతే అలీ) అబ్దుల్ గౌస్(డొంకేశ్వర్ -అల్ హుద) ఇస్మాయిల్ ( నికాల్పూర్) తదితరులు పాల్గొన్నారు.


వినయ్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లిం కమిటీ నాయకులు

## విష ప్రయోగం చేశారు..

- పెర్కిట్ మహిళా ప్రాంగణం అధికారి

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణ పరిధిలోని పెర్కిట్ దుర్గాబాయి మహిళ ప్రాంగణం జిల్లా అధికారి పద్మపై విష ప్రయోగం ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. మహిళ ప్రాంగణంలో అటెండర్‌గా పనిచేసిన సత్యవతిని సస్పెండ్ చేయడంతో అటెండర్ అలివేణితో కలిసి విష ప్రయోగం చేసేందుకు కుట్ర పన్నినట్టు ఆమె తెలిపారు. తాగే జ్యూస్ అన్నంలో విషం కలిపేందుకు అటెండర్లు పన్నాగం పన్ని ,అటెండర్ దగ్గర పనిచేసే అనితను విషప్రయోగం చేసేందుకు వాడుకున్నట్లు ఆమె చెప్పారు. ఈ విష ప్రయోగం విషయాన్ని ప్రాంగణంలో ఇతరులకు చెప్పడంతో తనకు తెలిసిందని అన్నారు. ఈ విషయమై పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు సైతం చేసినట్టు తెలిపారు. గతంలో అటెండర్ ప్రాంగణంలోని వస్తువులను దొంగతనం చేస్తున్నట్టు తెలిసి సస్పెండ్ చేశామన్నారు. ఈ విషయమై తనపై కక్ష కట్టి విష ప్రయోగం చేసినట్లు దీని వెనకాల ఎవరెవరు ఉన్నారో తేల్చి వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు సైతం ఫిర్యాదు చేస్తానని ఆమె తెలిపారు.

# విద్యుత్ సమస్యలను పట్టించుకోవడంలేదు

- మండల సమావేశంలో అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆగ్రహం
- సమాధానమివ్వని విద్యుత్‌శాఖ సబ్ ఇంజనీర్

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

పడకల్ సబ్‌స్టేషన్ ఏఈ మండల సర్వసభ్య సమావేశానికి రాలేదని అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి బ్రాహ్మణపల్లి ఎంపీటీసీ పోతెరాజు అన్నారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుంచాల విమల రాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు చేస్తున్న పనులు, వివరాలను వరించారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, విద్యుత్ సమస్యల గురించి తెలియజేయాలని వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి ఆహ్వానించగా విద్యుత్ ఏఈ బదులుగా సబ్ ఇంజనీర్ గౌతమి వచ్చి మౌనంగా ఉండి పోయారు. విద్యుత్ సమస్య గురించి ఆమెకు ఏమీ తెలియకపోవడంతో వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి వేరే శాఖ అధికారిని పిలువబోగా అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి విద్యుత్ సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమె అక్కడే నిలిచిపోయింది. మండలంలోని పడకల్ గ్రామంలో సింగిల్ విండో గోదాం వరకు లారీలు వెళ్లాలంటే విద్యుత్ వైర్లు లారీలకు తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉందని దీనిపైన ఎవరు సమాధానం ఇస్తారని ప్రశ్నించారు. పడకల్ తారు రోడ్డు నూతనంగా వేయడంతో ఎత్తు పెరిగినందున విద్యుత్ పోల్స్ చిన్నవి కావడంతో విద్యుత్ జిల్లా అధికారులను పెద్ద పోల్స్ వేయమని కోరగా పడకల్ సబ్ స్టేషన్‌లో కలిసి పరిష్కరించు కోవాలని తెలియజేశారని అన్నారు. పడకల్ సబ్ స్టేషన్ ఏఈ దీనిపైన సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపైన సబ్ ఇంజనీర్ ఎటువంటి సమాధానం ఇవ్వకుండా మౌనంగా ఉండిపోయారు. మండల సర్వసభ్య సమావేశానికి రావలసిన ఏఈ ప్రసాద్ జిల్లా స్థాయిలో గృహజ్యోతి పథకంపై సమావేశంపై నిజామాబాద్ వెళ్లడంతో ఏఈ ప్రసాద్‌కు వీలు కానందున సబ్ ఇంజనీర్ గౌతమిని సమావేశానికి పంపించారు. సమావేశంలో మండల విద్యుత్తు సమస్యల పైన సమాధానం ఇవ్వవలసిన సబ్ ఇంజనీర్ నిర్లక్ష్యంతో మౌనంగా ఉండిపోయారు. విద్యుత్ శాఖపైన మండల సర్వసభ్య సమావేశంలో సరైన సమాధానం ఇవ్వనందున కలెక్టర్‌కు చర్యలు తీసుకోవాలని తెలియజేస్తామని ఇన్చార్జ్ ఎంపీడీవో బ్రహ్మనందం తెలిపారు. అనంతరం ఉపాధి హామీ ఎపిఓ రవి మాట్లాడుతూ అన్ని గ్రామాలలో నర్సరీల పెంపకం జరుగుతుందని నర్సరీలో పండ్ల మొక్కలు కాజు వంటి మొక్కలను పెంచుతున్నామని అన్నారు. సిమెంట్ రోడ్డు పనులు చేపట్టాలంటే ఉపాధి హామీలో ఎక్కువమంది కూలీలు పనిచేయడానికి వచ్చే విధంగా ప్రోత్సహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, జడటిసి తనుజ శ్రీనివాస్ రెడ్డి, అన్ని గ్రామాల ఎంపీటీసీలు, మండల కో ఆప్షన్ మెంబర్ బులెట్ అక్బర్ ఖాన్, ఇన్చార్జి ఎంపీడీవో బ్రహ్మనందం, మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఎంపీడీవో బ్రహ్మనందం

## గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



**నవతెలంగాణ-రాజంపేట్**

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బాలకిషన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 7 నుంచి 14వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రత్యేక అధికారుల సహాయంతో ఆయా గ్రామాలలో సమస్యలు ముందుగానే గుర్తించి పరిశుభ్రతతో పాటు నీటిఎద్దడి లేకుండా వనరులను ఉపయోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాం, ఏపీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్‌కు సమ్మె నోటీసు అందజేత



**నవతెలంగాణ-జుక్కల్**

సీఐటీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిలో హెల్త్ సూపర్‌వైజర్‌కు మండలంలోని ఆశావర్కర్లు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు అజయ్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 16వ తేదీన సమ్మె గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో సిఐటియూ నాయకుడు అజయ్, ఆశాలు భాగ్యశ్రీ, పడంపల్లి, శ్రీదేవి, గంగామణి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తాం

- విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దండి
- బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి

**నవతెలంగాణ-రెంజల్**

తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులు, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించిందని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని పేపర్‌మిల్లు, కందకుర్తి, నీలా గ్రామాలలో పర్యటించి గ్రామాల సమస్యలపై స్థానిక నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆయన ఉపాధ్యాయులను ఆదేశించారు. నీలా పాఠశాలలో మౌలిక సదుపాయాలకు ఆరులక్షలు, గుంతపూడ్చడానికి రెండులక్షలు, పాఠశాల ఆవరణ శుభ్రపరచుకోవడానికి మరో రెండు లక్షల రూపాయలను కేటాయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరిట్ తీసుకురావాలని ఆయన విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన ప్రధానోపాధ్యాయులు ఈ.శంకర్‌కు సూచించారు. పొగాకు సీజన్‌లో విద్యార్థులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

గైర్హాజరవుతున్నారని ఆయన దృష్టికి తీసుకురాగా, ఇలాంటి సమయంలో వాళ్ల భవిష్యత్తును పాడు చేయవద్దని, పిల్లలను శ్రద్ధగా చదివించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో శంకర్, ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, గణేష్‌రావు, పిఆర్‌టియు మండలాధ్యక్ష కార్యదర్శులు సోమలింగంగౌడ్, సాయిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మొబిన్‌ఖాన్, నాయకులు గంగాకృష్ణ, సిహెచ్ రాములు, సురేందర్‌గౌడ్, జావీద్ ఉద్దీన్, ధనుంజయ్, గయా సుద్దీన్, సాయిరెడ్డి, లచ్చేవార్ నితీన్, బన్సియ నాయక్, మోహన్, ఎమ్మెల్యే రాజు, కాంగ్రెస్ యువజన నాయకులు కార్తీక్, గైన కిరణ్, శంషాద్దీన్, సద్దాం, శభాజ్, తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ ఎంపీ సీటు కాంగ్రెస్‌దే..**

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే దిశగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని కందకుర్తి గ్రామంలో ఆయన స్థానిక నాయకులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గం అభివృద్ధి తోపాటు ప్రజల సహాయ సహకారాలను తీసుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు రూ.10లక్షల చొప్పున ఖర్చు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కందకుర్తి పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకురాగా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల నియామకం చేపడతామని ఆయన వారికి హామీనిచ్చారు. సిసి రోడ్లపై కేజ్‌వీల్స్‌ను నడిపిస్తే కేసులు నమోదు చేయించేలా నాయకులు ముందుండాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయా గ్రామాలలో గ్రావెల్ రోడ్లకు నిధులు మంజూరు చేస్తామని ఆయన అన్నారు. గ్రామాలలో సమస్యలు ఉత్పన్నమైతే స్థానిక అధికారులతో వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు మొబిన్‌ఖాన్, స్థానిక నాయకులు గయాస్ ఉద్దీన్, హజ్మత్, ఫుర్ఖాన్, సిరాజ్, మతిన్, యాదవరావు, శంకర్, సాయిలు, సురేష్, సాజిద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ కరీం, గంగాధర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ మనువడివా..?

- ఎమ్మెల్యేను చమత్కరించిన మహిళ

**నవతెలంగాణ-రెంజల్**

మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూర్ సుదర్శన్‌రెడ్డి రెంజల్ మండల పర్యటనలో భాగంగా పేపర్‌మిల్లు గ్రామానికి విచ్చేయగా.. ఓ మహిళ జనంలోంచి వచ్చి 'ఇందిరమ్మ మనువడివా బిడ్డా. నాకు కండ్లు కనబడటం లేదు.' అని చెప్పడంతో ఎమ్మెల్యే చిరునవ్వు నవ్వారు. అనంతరం 'అమ్మా.. నీకు పింఛన్ వస్తుందా?' అని అడిగి తెలుసుకుని న్యాయం చేస్తానని ఆయన హామీనిచ్చారు.

## ఎదురెదురుగా బైకు ట్రాక్టర్ ఢీ..

- బాలిక మృతి
- మరో ఇద్దరికీ తీవ్ర గాయాలు
- నిజామాబాద్ ఆస్పత్రికి తరలింపు

**నవతెలంగాణ-మద్నూర్**



సాన్విక (ఫైల్)

ఎదురెదురుగా బైకు ట్రాక్టర్ ఢీకొనడంతో బాలిక మృతిచెందింది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని తడిహిప్పర్గ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. డోంగ్లి మండలంలోని లింబూరువాడి గ్రామానికి చెందిన రాజు చందు బాలిక సాన్విక (6)తో బైక్‌పై మద్నూర్ నుంచి సొంత గ్రామమైన లింబూర్‌వాడి గ్రామానికి సోమవారం రాత్రి 7 గంటల సమయంలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో మద్నూర్ మండలంలోని తడిహిప్పర్గ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఘటన స్థలంలోనే మృతిచెందింది. రాజు, చందు ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా.. వారిని ఆస్పత్రికి తరలించారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మద్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- అంత్యక్రియలకు వెళ్లివస్తుండగా.. చెరుకు లారీ ఢీకొనడంతో ప్రమాదం

**నవతెలంగాణ-సదాశివనగర్**



రాములు మృతదేహం

అంత్యక్రియలకు హాజరై తిరిగి వెళ్తుండగా.. వెనుక నుంచి చెరుకు లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కల్వరాల్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు వివరాల ప్రకారం.. టేక్రియాల్‌కు చెందిన చీకోటి రాములు(53) తన బామ్మర్ది తల్లి అంత్యక్రియలకు కల్వరాల్‌కు వెళ్లి హాజరై బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనక నుంచి వచ్చిన చెరుకు లారీ డ్రైవర్ తన లారీని అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ టైర్‌లు రాములు మీద నుంచి వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య సంఘవ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

## 30 కిలోల గంజాయి పట్టివేత

**నవతెలంగాణ-మోపాల్**

మోపాల్ మండలం బాడ్సి గ్రామంలో సుమారు 30 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి ఇంట్లో 30 కిలోల గంజాయి ఎండబెట్టడన్న సమాచారం మేరకు మోపాల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది వెళ్ళి చూడగా గంజాయిగా గుర్తించినట్టు సమాచారం. ప్రసాద్ బతుకు దెరువు నిమిత్తం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుండి వచ్చి డెకరేషన్ పని చేస్తూ ఇక్కడే ప్రేమ వివాహం చేసుకొని స్థిరపడినట్టు సమాచారం. ఇంట్లో ఏదో ఆకులు ఎండబెట్టడాన్ని స్థానికులు గమనించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. గంజాయి ఇతర రాష్ట్రాల నుండి క్రయ విక్రయాలు చేస్తున్నట్టు సమాచారం. దీని విలువ సుమారు ఆరు లక్షలకు పైగా ఉంటుంది. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు పేర్కొంటున్నారు.

## చారిత్రక పరిశోధకుడు యాదవరావుకు సన్మానం

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని కందకుర్తి గ్రామానికి చెందిన యాదవరావుకు ఇటీవల జాతీయస్థాయి చారిత్రక పరిశోధకుడిగా అవార్డును తీసుకున్న ఆయనను మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యాదవరావు మాట్లాడుతూ.. మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డికి ఈ గ్రామం పట్ల లేని ప్రేమ ఉందని, కందకుర్తి ఎత్తిపోతల పథకానికి సుమారు రూ.14కోట్ల వ్యయంతో స్టీల్ పైప్ లైన్స్ వేసి శాశ్వత పరిష్కారం చేశారని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు గయాస్ ఉద్దిన్, శంకర్ పటేల్, మాజీ సర్పంచ్ సాయిలు, ఫుర్‌ఖాన్, నిస్సార్‌బేగ్, మతిన్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్, ఉపసర్పంచ్‌కు సన్మానం

**నవతెలంగాణ-సదాశివనగర్**

మండలంలోని మల్లుపేట్ గ్రామంలో అంగన్వాడీ టీచర్ రాణి సర్పంచ్ బాలకిషన్ ఉపసర్పంచ్ భర్త సాయిలును శాలువాతో అంగన్వాడీ సెంటర్‌లో సన్మానించారు. ఐదు సంవత్సరాలు ఎంతో గ్రామాభివృద్ధికి కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## పెంటఖుర్దు పంచాయతీ పాలకవర్గానికి వీడ్కోలు

- కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ కిరణ్‌కుమార్



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

**నవతెలంగాణ-బోధన్**

మండలంలోని పెంటఖుర్దు గ్రామంలో మంగళవారం గ్రామపంచాయతీ పాలకవర్గానికి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి బోధన్ ఏసిపి కిరణ్ కుమార్ హాజరై పదవీ విరమణ పొందిన వార్డు సభ్యులకు, సర్పంచ్‌లకు సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సేవ చేయడం అనేది ఎంతో గొప్పదని ఐదు సంవత్సరాలు ప్రజలతో మమేకమై గ్రామాభివృద్ధికి పాటుపడడం ఉన్నత లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. గ్రామ సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా పదవి విరమణ పొందిన వారి సేవలు ప్రజలకు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు సాధించేలా కృషిచేసి ప్రజాసేవకు పాటుపడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బుద్దె సావిత్రి, ఎంపీడీవో పర్బన్న, ఎంపీఓ మధుకర్, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ షకీల్, ఐడిసిఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, చిట్టెపు కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివ సాయిపటేల్, బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్, ఎడపల్లి ఎస్సై విక్రం, పెంటఖుర్దు క్యాంప్ సర్పంచ్ శ్రీనివాసరావు, స్థానిక గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గృహజ్యోతి పథకానికి పత్రాలు ఇవ్వండి

**నవతెలంగాణ-భిక్కనూర్**

రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకంలో భాగంగా విద్యుత్ అధికారులు గృహ అవసరాలకు విద్యుత్‌ను వినియోగిస్తున్న వినియోగదారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, సెల్ ఫోన్ నెంబర్‌ను కరెంటు బిల్లు ఇచ్చే విద్యుత్ సిబ్బందికి అందజేయాలని విద్యుత్ ఏఈ సంకీర్త ఒక ప్రకటనలో తెలిపారు. గృహజ్యోతి పథకం కేవలం గృహ అవసరాలకు వినియోగించే విద్యుత్తుకు మాత్రమే వర్తిస్తుందని, ఒక రేషన్ కార్డుకు ఒక్క విద్యుత్ మీటర్‌కు మాత్రమే ఉచిత విద్యుత్ ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు కరెంటు బిల్లు ఇచ్చే విద్యుత్ సిబ్బందికి పత్రాలు అందజేయాలని సూచించారు. విద్యుత్ మీటర్లకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు లింకైన తర్వాత ప్రభుత్వం ఆదేశాలు వచ్చిన తర్వాత ఉచిత విద్యుత్ అమలవుతుందని తెలిపారు.

## వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు

**నవతెలంగాణ-నసురుల్లాబాద్**

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిజియోథెరపీ శిబిరంలో నసురుల్లాబాద్ మండల పరిధిలో చదువుతున్న వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ డాక్టర్ మనీషా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనీషా మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇప్పటికే శిబిరానికి రానివారు ఫిజియోథెరపీ పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మండ్లు, శిబిరం నిర్వాహకులు సిబ్బంది, సురేష్, రూప, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మీటర్ రీడింగ్ ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించండి

- గృహజ్యోతికి అర్హులు కండి ట్రాన్స్‌కో ఏఈ

**నవతెలంగాణ-మద్నూర్**

మద్నూర్ మండల కేంద్రంలో గృహ జ్యోతి పథకం కింద అర్హులైన వారి వివరాలను సేకరిస్తున్న కరెంట్ రీడింగ్ ట్రాన్స్‌కో సిబ్బందికి కరెంటు వినియోగదారులు సహకరించాలని మద్నూర్ ట్రాన్స్‌కో ఏఈ సూచించారు. గృహజ్యోతి పథకం కోసం ప్రతి ఒక్కరూ కరెంటు సిబ్బందికి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, అలాగే సెల్‌ఫోన్ నెంబర్లు అందించాలని ఆయన కోరారు. కాగా మంగళవారం మద్నూర్ మండల కేంద్రంలో ట్రాన్స్‌కో ఏఈ సిబ్బందితో కలిసి గృహ జ్యోతి పథకం అమలు కోసం వినియోగదారుల నుంచి వివరాలను సేకరించారు.

## పారిశుధ్య వారోత్సవాలను విజయవంతం చేయండి

- ఎంపీడీవో సుబ్రహ్మణ్యం

**నవతెలంగాణ-నసురుల్లాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని నసురుల్లాబాద్ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో పారిశుధ్య వారోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7 నుంచి 14 వరకు ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. అందుకు గ్రామ కార్యదర్శి పనులను గుర్తించి వాటిని ప్రత్యేక అధికారుల చొరవతో పనులను విజయవంతం చేయాలన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ గ్రామ ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా గ్రామ కార్యదర్శి కృషి చేయాలన్నారు. నిర్వహిస్తున్న పారిశుధ్య వారోత్సవాల్లో కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీలు ఉంటాయని ఆయన అన్నారు. అందుకు అనుగుణంగా గ్రామ కార్యదర్శి విధులు సక్రమంగా నిర్వహించాలని ఆయన సూచించారు. నిర్లక్ష్యం చేసిన వారిపై తగుచర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాము, వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## దిండి భక్తులకు అల్పాహారం అందజేత

**నవతెలంగాణ-మద్నూర్**

బీర్కూరు మండలంలోని బైరాపూర్ గ్రామానికి చెందిన భక్తులు ప్రతి సంవత్సరం దిండి యాత్ర ద్వారా మహారాష్ట్రలో ప్రఖ్యాతగాంచిన పండర్పూర్ విఠలేశ్వర ఆలయానికి వెళ్లే భక్తులకు మంగళవారం మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయంలో దిండి భక్తులకు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్సింలుగౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం అందజేశారు. దిండి భక్తులకు అల్పాహారం అందించిన ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్సింలు గౌడ్‌కు, ఇతర భక్తులకు దిండి యాత్ర భక్తులు అభినందనలు తెలియజేశారు.

## ప్రయాణ ప్రాంగణంలో నీటి వసతి కల్పన

**నవతెలంగాణ-జుక్కల్**

మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో నీటివసతి కల్పించినట్టు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆస్పత్‌వార్ వినోద్ తెలిపారు.

# అంగన్‌వాడీల సమ్మెనోటీస్ అందజేత

- భారత్ బంద్‌కు సంపూర్ణ మద్దతు

**నవతెలంగాణ-నసురుల్లాబాద్/ఎడపల్లి**

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. 2024 ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌లో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అందరూ పాల్గొంటారని తెలియజేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం బాన్సువాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ వాణికి సమ్మె నోటీసును అందజేశారు. సిఐటియు నాయకులు సురేష్, కలిల్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె చేస్తున్నామన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు గడిచిపోతున్నా కార్మిక సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందిందని ఆయన ఆరోపించారు. పని భారం పెంచినప్పటికీ పనికి తగ్గ వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నాలుగు కార్మిక చట్టాలను వెంటనే రద్దుచేసి కార్మికులకు 8 గంటల పనిదినాలు అమలు జరిగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయినా కార్మికవర్గాల సమస్యలను పరిష్కరించలేదని పనిభారం పెంచి పనికి తగ్గట్టు వేతనం ఇవ్వకపోగా నూతన విద్యావిధానంతో పాటు కార్మికుల హక్కులు హరించే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందని, లేబర్ కోడ్‌లను రద్దుచేసి ఎనిమిది గంటల పనిదినాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడి సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సుప్రీంకోర్టు తీర్పుప్రకారం 26 వేల వేతనం ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు పెండింగ్‌లో ఉన్న టిఏ, డిఏలను, గృహ బిల్లు, గ్యాస్ బిల్లులు డిసెంబర్ నెల జనవరి నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి యూనియన్ నాయకులు మహాదేవి, రేణుక, ఇందిరా, బాలమణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



నసురుల్లాబాద్‌లో..



ఎడపల్లిలో..

**భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి**

**ఎడపల్లి :** ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మధ్యాహ్నం భోజనం కార్మికులతో పాటు అసంఘటిత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షురాలు సిహెచ్ లక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం ఎడపల్లి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కార్యాలయ సిబ్బందికి సమర్పించిన అనంతరం నిరసన వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనంతో పాటు పెండింగ్‌లో ఉన్న బకాయిలు సుమారు 10 కోట్లు రావాల్సి ఉందని ఆమె తెలిపారు. నెలలు గడుస్తున్నా మధ్యాహ్నం భోజన కార్మికులకు నెలవారీగా ఇచ్చే గౌరవ వేతనం లేదని తెలిపారు. బకాయిలున్న పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలోని బాలబాలికలకు మధ్యాహ్నం భోజనం పథకాన్ని సక్రమంగా అమలు చేస్తున్నా కార్మికులకు ప్రభుత్వాలు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం పట్ల తీవ్ర మనస్తాపానికి గురవుతున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు ఒక్కొక్క మండలానికి రెండు కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ ఎడపల్లి మండలాధ్యక్షురాలు దేరడి లక్ష్మి, బట్టు సాయమ్మ బట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాల్కసుమన్‌కు అహంకారం తగదు

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాల్కసుమన్ దిష్టిబొమ్మలు దహనం

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ ఖబర్దార్ నీకు రాజకీయ పుట్ట గతులు ఉండవని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాల్కసుమన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు.

**బిచ్కుంద :** మండల కేంద్రంలోని బస్టాండ్ ముందర కాంగ్రెస్ శ్రేణులు బాల్కసుమన్ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పిసిసి డెలిగేట్ విట్టల్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మున్నూరు నాగనాథ్, పార్టీ మండల అధ్యక్షులు ధర్పల్లి గంగాధర్, జుక్కల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఇన్చార్జి విజయ్ భాస్కర్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, కమల్ సెట్, అస్పత్వార్ అశోక్, వెంకటరెడ్డి, మైనార్టీ నాయకులు పాషా, నౌషా నాయక్, హాజీ బాల్రాజ్, శ్రీనివాస్, ఎంపిటిసి సురేష్, నూకల్ రాజు, బాలకిషన్, నాయకులు కార్యకర్తలున్నారు.

**భిక్కనూర్ :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కమిటీ చైర్మన్ దశరథం, మండల జనరల్ సెక్రెటరీ భూపాల్, నాయకులు అమృతరావు, శ్రీనివాస్, రాజు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

**నిజాంసాగర్ :** మండల కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పులతో కొడుతూ బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లయ్యగారి ఆకాష్, పెద్ది హనుమాన్లు, బుడిమే శ్రీనివాస్, ఒంటరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పిట్లం :** మండల కేంద్రంలోని బాన్సువాడ చౌరస్తాలో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రం బాల్ రాజు మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడ్ల రాజు, శ్రీనివా స్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మైనారిటీ నాయకులు షకీల్, ఎస్సీ సెల్ యూత్ నాయకులు నాగరాజ్, జోలక్ మల్లేష్, ఎరుకల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**లింగంపేట్ :** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు.

**కామారెడ్డి :** బిబిపేట్ మండలం తుజాల్పూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాల్క సుమన్ రేవంత్‌రెడ్డిపై చేసిన ఆరోపణను ఖండిస్తూ నిరసన తెలియజేశారు.



జుక్కల్ : దిష్టిబొమ్మను పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

**జుక్కల్ :** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు.

**వర్ని :** రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయటం వారి మూర్ఖత్వానికి నిదర్శనమని మోస్రా మండల అధ్యక్షులు లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేసినారు. బాల్క సుమన్ దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ దహనం చేశారు.

**మద్నూర్ :** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

**ఎడపల్లి :** మండలంలోని బాపునగర్ గ్రామంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

- ఎస్ఎఫ్ఐ

**నవతెలంగాణ-జుక్కల్**




మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసంతో పాటు గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలని అన్నారు. పిల్లలు ఉన్నత స్థానంలో ఉండే విధంగా మారుమూల పేద విద్యార్థులకు విద్యబోధన నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ఉత్తీర్ణత శాతం పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్, మండలాధ్యక్షుడు షేక్ ఫిర్దోస్, నాయకులు అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వామిగౌడ్ జన్మదిన వేడుకలు

**నవతెలంగాణ-బోధన్**

సాలూర మండల కేంద్రానికి చెందిన గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు మల్లెపూల స్వామిగౌడ్ జన్మదిన వేడుకలను మంగళవారం సాలూర మండల కేంద్రంలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బుద్దె సావిత్రి స్వామి గౌడ్‌ను గజమాల, శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి తన వంతు పాత్ర పోషిస్తున్న గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు స్వామిగౌడ్ ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ షకీల్, మాజీ సొసైటీ చైర్మన్ శివకాంత్ పటేల్, వెంకట్ పటేల్, ఐడిసిఎంఎస్ డైరెక్టర్ రాజా గౌడ్, దత్తు, బిఎస్పి జిల్లా అధ్యక్షులు సింగడి పాండు, ఖదీర్, చంటి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.